APTEL/25/A4660

# ఆంధ్ర జననాడు

తెలుగు దినపత్రిక

ఆంధ్ర జననాడు

ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా,
మండలాల వారిగా విలేఖర్లుగా పని చేయడానికి
అనుభవం కలిగిన లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు
సంప్రదించండి
89195 17176

సంపుటి :01 సంచిక : 128 ఎడిటర్ : ఎం. ఎ. నవీన్ కుమార్ పేజీలు : 08, వెల. 1రూ/ శనివారం-16 - మే - 2026

## మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు'
## పెట్రో ధరల పెంపుపై రాహుల్ గాంధీ ఫైర్




'ప్రస్తుతం పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచి షాక్ ఇచ్చారు- మిగిలిన వసూళ్లు వాయిదాల పద్ధతిలో జరుగుతాయ్' - రాహుల్ గాంధీ ఎద్దేవా

ఢిల్లీ : పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మోదీ సర్కార్ పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం చేసిన తప్పునకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారని విమర్శించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగిపోయాయి. దీనితో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలు ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపైకి నెట్టాయి. దీనితో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ కు రూ.3 చొప్పున పెరిగాయి. మిగతా..2లో

## నా పేరు వాడొద్దు... కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్



పోక్సో కేసులో తన పేరును ఉపయోగించకుండా చూడాలని పిటిషన్

ఇప్పటి వరకు వాడిన వీడియోలు తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి

తన కుమారుడి వివాదంలో తన పేరు ఉపయోగించకుండా ఉత్తర్వులివ్వాలన్న బండి సంజయ్

ఢిల్లీ : కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. పోక్సో కేసులో భవిష్యత్తులో మిగతా..2లో

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు...
## వాళ్లది పవర్ ఫుల్ కాంబో



★ పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ

★ మోదీ, రాజ్ నాథ్, చంద్రబాబు 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ లోకేష్ ప్రశంసలు

★ వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ తట్టుకోలేమన్న లోకేష్

★ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఐరన్ మ్యాన్‌గా అభివర్ణన

## ఐదో తరం విమానాలు గగనంలో
# ఎగరబోతున్నాయి

● పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు

● ఏపీ అభివృద్ధికి చంద్రబాబు వంటి నిబద్ధత కలిగిన నాయకుడు ఉండాలని వెల్లడి

### పుట్టపర్తి వేదిక కాబోతోంది




అమరావతి : పుట్టపర్తి నుంచి ప్రపంచంలోని ప్రతి మూలకు డ్రోన్ సరఫరా చేసే క్షణం రాబోతోందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సమగ్ర సంపూర్ణ ప్రాంతీయ అభివృద్ధి త్వరలోనే సాకారం కాబోతోందని తెలిపారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మిగతా..2లో

## ఏపీకి ఏఎంసీఏ ప్రాజెక్టు..
## ఎక్స్‌లో పవన్ కల్యాణ్ స్పందన





రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఏఎంసీఏ ప్రాజెక్టు కీలకమైన మైలురాయి అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభివర్ణించారు.

అమరావతి, మే 15: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా

## ఐఎండీ చల్లని కబురు- ఈనెల 26న కేరళను
## తాకనున్న నైరుతి రుతుపవనాలు

❖ ఈ ప్రక్రియ అంచనా తేదీకి నాలుగు రోజుల ముందుగా లేదా ఆలస్యంగా జరిగే అవకాశం కూడా ఉందని ప్రకటన

❖ తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుందని వెల్లడి



ఢిల్లీ: ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు అందించింది భారత వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు మే 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. మే 26న రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉండవచ్చని ఐఎండీ వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1 నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం అధికారికంగా ప్రారంభమవుతుంది. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది రుతుపవనాలు మిగతా..2లో

## సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు
## సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు



● ఇంధన పొదుపు చర్యలు చేపట్టిన సుప్రీంకోర్టు

● ఇకపై వారంలో రెండు రోజులు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ

● విచారణ లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని ఆదేశాలు జారీ

ఢిల్లీ : సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇక నుంచి వారంలో రెండు రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే

## కాంగ్రెస్‌ను కేంద్రంలో
## అధికారంలోకి తేవడమే లక్ష్యం

❖ గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు..

❖ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు.



హైదరాబాద్, మే 15 : గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. (శుక్రవారం) హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. మిగతా..2లో

## బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై
## సీఎస్ కీలక సమీక్ష!



★ హైదరాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, చెన్నై హైస్పీడ్ రైలు ప్రాజెక్టులపై సీఎస్ సమీక్ష నిర్వహించారు.

★ భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.

హైదరాబాద్: : తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టబోతున్న మూడు భారీ హైస్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) కారిడార్ ప్రాజెక్టుల తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన మూడు భారీ హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

## కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు
# దూరమయ్యారన్న కవిత

● పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య

● ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, !

● అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత



హైదరాబాద్: ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

## బండి సంజయ్, కిషన్ రెడ్డి
## దొంగ ఓట్లతో గెలిచారు

★ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మహేష్ గౌడ్

★ గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని ఆరోపణ

★ బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని వ్యాఖ్య




హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి

## మొదటి పేజి తరువాయి

## ఏపీకి ఏఎంసీఏ ప్రాజెక్టు.. ఎక్స్‌లో పవన్ కల్యాణ్ స్పందన

రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

### పవన్ ట్వీట్..

'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ & ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు - సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు...
# వాళ్లది పవర్ ఫుల్ కాంబో

అమరావతి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు.. వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారి వయసు 75 ఏళ్లయినా, వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుందని అన్నారు. ఈ ముగ్గురి వేగాన్ని తట్టుకోవడం ఎవరి వల్లా కాదని లోకేష్ వ్యాఖ్యానించారు. వీరిది పవర్ ఫుల్ కాంబినేషన్ అని కొనియాడారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్ర మారబోతోందని లోకేష్ అన్నారు. రక్షణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చిన 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేస్తూ, దాని వెనుక ఉన్న అసలైన శక్తి, ఐరన్ మ్యాన్ కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అని లోకేష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### వినతిపత్రంలోని ప్రధాన సూచనలు:

గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున, ఈ ప్రక్రియను ఒకటిన్నర సంవత్సరం నుంచి నుంచి 2 ఏళ్ల పాటు దశలవారీగా చేపట్టాలి. బూత్ లెవల్ ఆఫీసర్లు జియో-ట్యాగ్ ఫొటోలతో కనీసం మూడుసార్లు గృహ సందర్శన చేసి భౌతిక ధృవీకరణ చేయాలి. ఓటును తొలగించే ముందు ఏడు రోజుల ముందస్తు రాతపూర్వక నోటీసు తప్పనిసరిగా ఇవ్వాలి. అభ్యంతరాల స్వీకరణకు కనీసం నెల రోజులు గడువు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ పార్టీలకు 2002 మరియు 2025 నాటి ఓటర్ల జాబితాల సాఫ్ట్ మరియు హార్డ్ కాపీలను అందించాలి. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ జాబితాలను సకాలంలో పార్టీలకు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 2002 తర్వాత రాష్ట్రానికి వలస వచ్చి, కనీసం రెండుసార్లు ఓటు వేసిన వారికి అఫిడవిట్ ప్రాతిపదికన ఓటు హక్కు కల్పించాలి. జనాభా గణన, ఎస్ఐఆర్ విధులను వేర్వేరు అధికారులు నిర్వహించాలి. ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించకూడదని కాంగ్రెస్ నేతలు కోరారు.

## కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యం

వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు.ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## నా పేరు వాడొద్దు... కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

తన పేరును వాడకుండా చూడాలని పిటిషన్ వేశారు. అలాగే తన పేరుతో ఇప్పటి వరకు వాడిన వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడిపై నమోదైన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి ఈ వివాదంలో తన పేరును ఎక్కడా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా, బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంపై కేసు నమోదైంది. బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.

## అస్తిత్వ పోరాటమా... అవకాశవాదమా?

డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు రెండు దశాబ్దాలపాటు (అడపాదడపా మిత్రభేదం మినహాయిస్తే) కలిసి రాజకీయ ప్రయాణం చేశాయి. భాజపా వ్యతిరేక జాతీయ సంఘటనలో కాంగ్రెస్‌కు స్టాలిన్ నమ్మదగిన మిత్రుడు. కాలపరీక్షకు నిలబడిన భావసారూప్యత కలిగిన భాగస్వామి. అలాంటి మిత్రుణ్ని తమిళనాడు ఎన్నికల తరవాత దూరం చేసుకుని టీవీకే నేత విజయ్‌కు దగ్గరై హస్తం పార్టీ సాధించేది ఏముందనే చర్చ దేశవ్యాప్తంగా సాగుతోంది. అయితే, కాంగ్రెస్ కొత్త మిత్రుడితో చెయ్యి కలపడం హఠాత్తు నాటకీయ పరిణామంగా పైకి కనపడుతున్నా అంతా ప్రణాళికాబద్ధంగానే జరిగినట్టు అర్థం అవుతోంది. డీఎంకేతో రెండు దశాబ్దాల మైత్రి వల్ల తమిళనాడులో కాంగ్రెస్ బావుకున్నది ఏముందనే ఆవేదన ఆ పార్టీలో మొదలైంది. స్నేహం వల్ల ఉభయులూ లబ్ధి పొందాలి. కానీ తాము పదవులను అనుభవిస్తూ మిత్రపక్షమైన కాంగ్రెస్‌ను మాత్రం డీఎంకే అధికార సౌధానికి ఆమడ దూరాన ఉంచేసింది. దాంతో ఒక చక్రబంధంలో ఇరుక్కుని ఊపిరాడని పరిస్థితిలో జాతీయపార్టీ ఉండిపోయింది. ఒకరకంగా చెప్పాలంటే డీఎంకేనే కాంగ్రెస్‌కు పొగబెట్టి తనకుతానుగా బయటకు వెళ్లే స్థితిలోకి నెట్టేసింది. మరి విజయ్‌తో చేతులు కలిపితే కాంగ్రెస్‌కు వచ్చే లాభం ఏంటి? టీవీకేతో మైత్రి ఒప్పందం ప్రకారం రాష్ట్ర స్థాయిలో అధికార భాగస్వామ్యంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయి. అన్ని స్థాయుల్లోనూ అధికారాన్ని పంచుకుంటాయి. అదే జరిగితే అయిదు దక్షిణాది రాష్ట్రాలలో నాలుగింటిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నట్టే. ఆరు దశాబ్దాల తరవాత తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామి అవుతుంది. విజయ్ సామాజిక నేపథ్యం కూడా కాంగ్రెస్‌కు కలిసొస్తుంది. కామరాజ్ నాడార్ తరహా రాజకీయాలకు హస్తం పార్టీ ఇప్పుడు తమిళనాడులో శ్రీకారం చుట్టవచ్చు.

పూలమ్మిన చోట కట్టెలమ్మే స్థితిలో...

ఓడలు బళ్లు అవుతాయి, బళ్లు ఓడలు అవుతాయి అంటారు కదా! తమిళనాడులో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి అదే. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి కూడా తమిళనాడులో కాంగ్రెస్ ఒక వెలుగు వెలిగింది. నెహ్రూ సమకాలికులైన రాజాజీ, కామరాజ్ నాడార్ లాంటి నాయకులు తమిళ నేలపై కాంగ్రెస్ నీడలో ఎదిగారు. స్వతంత్ర భారతంలో కూడా రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు తమిళనాడు బ్రహ్మారథం పట్టింది. ఇంకా చెప్పాలంటే, ఆ ఇరవయ్యేళ్ల కాలం ఆ రాష్ట్రంలో హస్తం పార్టీకి స్వర్ణయుగం లాంటిది. అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పార్టీని కామరాజ్ సామాజిక న్యాయం దిశగా నడిపించారు. అట్టడుగు వర్గాల్లో కాంగ్రెస్ బలమైన పట్టు సాధించడానికి ఆయన సామాజిక నేపథ్యం ఉపకరించింది. అదే సమయంలో పెరియార్ ఈవీ రామస్వామి ప్రభావంతో కులాతీత ఆత్మగౌరవం ప్రాతిపదికన తమిళనాట ద్రావిడ రాజకీయాలు వేళ్లూనుకున్నాయి. రాష్ట్రాల అధికారాలు, హక్కులు, ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలకు జాతీయ ప్రధాన స్రవంతిలో చోటు కల్పించడంలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమైంది. ఫలితంగా ద్రావిడ అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకున్నాయి. అదే సమయంలో నాయకత్వ మార్పు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి విఘాతంగా పరిణమించింది. అసమ్మతి గళాలకు ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. ఇందిరాగాంధీ ప్రధాని కావడానికి కీలకంగా వ్యవహరించిన నాయకుల్లో కామరాజ్ ఒకరు. అలాంటి ఆయన కూడా ఇందిర నాయకత్వ పోకడలు నచ్చక కాంగ్రెస్ నుంచి బయటికి వెళ్లిపోయారు. ఇలా అనేకానేక ప్రతికూల పరిస్థితుల ప్రభావం వల్ల తమిళనాడులో కాంగ్రెస్ క్రమేణా ప్రజాదరణ కోల్పోయింది. జాతీయ భాష అంటూ హిందీకి ప్రాధాన్యమివ్వడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రయత్నించడం కూడా రాష్ట్రంలో ఆ పార్టీకి చేటుచేసింది. అన్నాదొరై డీఎంకే పార్టీని ఏర్పాటుచేసిన తరవాత కాంగ్రెస్‌కు రాష్ట్రంలో దాదాపుగా నూకలు చెల్లిపోయాయి. ద్రావిడ సెంటిమెంటుతో 1967 ఎన్నికల్లో అన్నా విజయభేరి మోగించారు. అలా ఒక ప్రాంతీయ పార్టీ నాయకత్వంలో దేశంలో మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ ఎన్నికల్లో బలంగా వీచిన కాంగ్రెస్ వ్యతిరేక పవనాల కారణంగా కామరాజ్ సైతం ఒక విద్యార్థి నాయకుడి ..

# ఐదో తరం విమానాలు గగనంలో ఎగరబోతున్నాయి

## మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ తెలుగులో ప్రసంగం ప్రారంభించి ఎలా ఉన్నారు అంటూ ప్రజలను పలకరించారు. ఈ రోజు చరిత్రాత్మకమైన రోజు అని ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇవాళ అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసుకున్నట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. విద్య, సేవ, ఆధ్యాత్మికతో పుట్టపర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. చంద్రబాబు వంటి దూరదృష్టి కలిగిన నాయకుడిని ఎక్కడా చూడలేదని ఏపీ అభివృద్ధికి ఇటువంటి నిబద్ధత కలిగిన నాయకుడు ఉండాలని కొనియాడారు. చంద్రబాబు దృక్పథం శాస్త్రీయమైనదని ఎన్నో అంతర్జాతీయ సంస్థలు ఈయన కృషిని గుర్తించాయని చెప్పారు. చంద్రబాబు వల్లే గూగుల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతుందని అన్నారు. ఏపీ అంటే అడ్వాన్స్ ఆంధ్రప్రదేశ్‌గా మారబోతుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, సమష్టి కృషి, విశ్వ సోదర భావన స్ఫూర్తితో ముందుకెళ్దామని రాజ్‌నాథ్ సూచించారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు: కొన్నేళ్లక్రితం రక్షణ రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లమని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయని వెల్లడించారు. 2004లో కేవలం భారత్ రూ.46 వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాలు తయారీ ఉండేదని ప్రస్తుతం రికార్డు స్థాయిలో లక్షా రూ.75 వేల కోట్లకు పెరిగిందని గర్వంగా చెబుతున్నామని



అన్నారు. రక్షణ రంగంలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామని వివరించారు. దేశ రక్షణ అనే మహత్తర యజ్ఞంలో ప్రతిఒక్కరూ తమ సహకారం అందిస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య నమూనా రక్షణ రంగ తయారీకి ప్రజా ఉద్యమంగా మారిందని స్థానిక యువతకు అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీ సంపూర్ణ అభివృద్ధికి దోహదపడేలా ఈ పరిశ్రమలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయని వెల్లడించారు. యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారిందని అన్నారు. ఇకనుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. "ఐదో తరం విమానాలు గగనంలో ఎగరబోతున్నాయి. పుట్టపర్తి కూడా వేదిక కాబోతోంది. కనురెప్పపాటులో శత్రువులను నాశనం చేసే విమానాలు ఉత్పత్తి కాబోతున్నాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రాజెక్టు రక్షణ మంత్రిత్వశాఖ ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ. రూ.480 కోట్లు పెట్టుబడులతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రాబోతోంది. ఈ సంస్థల వల్ల ఇతర దేశాల నుంచి దిగుమతులు తగ్గుతాయి. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1,294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీరంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యయనం ప్రారంభం కాబోతోంది.

# బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై సీఎస్ కీలక సమీక్ష!

## మొదటి పేజి తరువాయి

నిర్వహించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్:

హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు.

### ఆ రూట్లలో డీపీఆర్ సిద్ధం:

హైదరాబాద్ పూనే ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ బెంగళూరు కారిడార్, హైదరాబాద్ చెన్నై కారిడార్ లో సుమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని



సీఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఎవీణూ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# ఐఎండీ చల్లని కబురు- ఈనెల 26న కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

## మొదటి పేజి తరువాయి

మే 24న ప్రవేశించినట్లు ఆ శాఖ వెల్లడించింది.

తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణ అనేది కేరళలో వాటి ఆగమనంతో గుర్తిస్తాం. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పును సూచించే ఒక ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది." అని ఐఎండీ పేర్కొంది.

### సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం

ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. దేశంలో తక్కువ వర్షపాతానికి కారణమయ్యే 'ఎల్ నినో' పరిస్థితులు



ఏర్పడటమే దీనికి కారణం కావచ్చనిఅభిప్రాయపడింది. రుతుపవన కాలాల్లో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971-2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా నైరుతి రుతుపవనాలను పిలుస్తారు. నాలుగు నెలల పాటు సాగే ఈ రుతుపవన కాలం దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతాన్ని అందిస్తుంది. వ్యవసాయానికి, పంటలకు, మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, అలాగే జలాశయాలు, భూగర్భ జలాలను తిరిగి నింపడానికి ఇది అత్యంత కీలకం. మన దేశంలో 50 శాతానికి పైగా నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

### 92 శాతం వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశం

ఇదిలా ఉండగా, దేశ వ్యవసాయ రంగానికి కీలకమైన నైరుతి రుతుపవనాలపై ఎల్ నినో ప్రభావం పడనుందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. ఈ ఏడాది జూన్- సెప్టెంబర్ లో నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలిపింది. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఫలితంగా దేశంలోని వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పింది.

## మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు'
# పెట్రో ధరల పెంపుపై రాహుల్ గాంధీ ఫైర్

## మొదటి పేజి తరువాయి

గత నాలుగేళ్ల లేదా అంత కంటే ఎక్కువ కాలంలో ఇంధన ధరలు పెరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అయితే దీనిపై లోక్ సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "మోదీ ప్రభుత్వం తప్పు చేసింది. ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.3 పెంచి షాక్ ఇచ్చారు. మిగిలిన వసూళ్లు వాయిదాల పద్ధతిలో జరుగుతాయి."

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత,**

సీఎన్ జీ ధరలు కూడా పెరిగాయ్ మరోవైపు ఢిల్లీ, ముంబయి లాంటి నగరాల్లో సీఎన్ జీ ధరలు కూడా కిలోకు రూ.2 చొప్పున పెంచారు. పరిశ్రమ వర్గాల ప్రకారం, ఢిల్లీలో పెట్రోల్ ధర లీటర్ కు రూ.94.77 నుంచి రూ.97.77కు పెరిగింది. లీటర్ డీజిల్ ధర రూ.87.67 నుంచి ఇప్పుడు రూ.90.67కు చేరింది. అయితే రాష్ట్రాలు విధించే 'విలువ ఆధారిత పన్ను' (వ్యాట్)లో ఉన్న వ్యత్యాసాల కారణంగా ఈ ధరలు ఆయా రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయి. తర్వాత ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగి, హర్మూజ్ జలసంధిని దిగ్బంధనం చేసింది. దీనితో అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ గుండా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రపంచ మార్కెట్లో ముడిచమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతలు వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం దేశీయ ఇంధన సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా చూసింది. అయితే నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందువల్లనే కేంద్రం ఇంధన ధరలు పెంచలేదని, దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయని, అప్పట్లోనే ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీని తర్వాత బంగాల్ , అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురువేసి, ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది. బంగాల్ లో అయితే మొదటిసారి కాషాయపార్టీ తన జెండాను పాతగలిగింది. అయితే విపక్షాలు అన్నట్లుగానే, అసెంబ్లీ ఎన్నికలు అయిన తర్వాత మోదీ సర్కార్ , ఇంధన ధరలు పెంపు నిర్ణయం తీసుకుంది. దీనితో 2022 మే తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు అత్యంత గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

### రూ.3 పెంపు సరిపోతుందా?

తాజాగా పెంచిన ధరలు చాలా మంది భారతీయులకు భారంగా మారాయన్నది వాస్తవం. అయితే లీటర్ పెట్రోల్, డీజిల్ పై రూ.3 పెంపు అనేది చాలా ఎక్కువగా అనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి ఇది ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) భరిస్తున్న నష్టాన్ని తీర్చలేదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు ఓఎంసీలు మంచి లాభాల్లో ఉన్నాయి. కానీ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ నష్టాలను భరిస్తూ వస్తోంది. ఈ యుద్ధం ఇంకొన్నాళ్లు కొనసాగితే, ప్రతి కంపెనీ తీవ్రమైన నష్టాలకు, ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. నిపుణుల ప్రకారం, యుద్ధానికి ముందు బ్యారెల్ ముడిచమురు ధర సగటున 69 డాలర్లుగా ఉండగా, ఈ ఏప్రిల్ లో సగటున 114.48 డాలర్లకు, మే నెలలో ఇప్పటి వరకు సగటున 105.87 డాలర్లకు చేరుకుంది. దీని వల్ల ఓఎంసీలు భారీగా నష్టపోతున్నాయి. ఈ భారీ నష్టాలను పూడ్చుకోవాలంటే, లీటర్ పెట్రోల్ ధర రూ.28లు, లీటర్ డీజిల్ ధర రూ.33 వరకు పెంచితేకాని ఏఎంసీలకు బెనిఫిట్ ఉండదు. అయితే ప్రస్తుత భారత రాజకీయ వాతావరణంలో, ఇంతటి భారీ స్థాయిలో ఇంధన ధరలు పెంచడం సాధ్యం కాదని నిపుణులు అంటున్నారు.

## సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు- సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు

## మొదటి పేజి తరువాయి

కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తామని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేశారు. ఆన్‌లైన్ విచారణ కోసం లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణ సమయంలో సాంకేతిక అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు సీజేఐ సహా ఇతర న్యాయమూర్తులు కార్ పూలింగ్ విధానాన్ని అనుసరించనున్నారు. రిజిస్ట్రీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 50 శాతం మందికి వారంలో రెండ్రోజుల పాటు వర్క్ ఫ్రం హోం విధానాన్ని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇందుకోసం వీక్లీ రోస్టర్‌ను తయారు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇళ్ల నుంచి పనిచేసే వారు ఎల్లప్పుడూ ఫోన్ ద్వారా అందుబాటులో ఉండాలని, అవసరమైతే వెంటనే కార్యాలయానికి రావాల్సి ఉంటుందని తెలిపింది. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా నిర్ధారించుకోవాలని రిజిస్ట్రీకి సూచించింది. అయితే, వర్క్ ఫ్రం హోమ్ సమర్థవంతంగా లేదని సంబంధిత రిజిస్ట్రార్ అభిప్రాయపడితే, ఆయా శాఖ లేదా విభాగానికి అటువంటి ఏర్పాట్లను పరిమితం చేయవచ్చు లేదా సవరించవచ్చునని సర్క్యులర్ లో పేర్కొంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సుప్రీంకోర్టు ఈ చర్యలు చేపట్టింది.

ఇంధన సంక్షోభంపై మోదీ సూచనలు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ క్రమంలో భవిష్యత్ లో దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. ఇంధనం పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే, ఏడాది పాటు బంగారం కొనవద్దని చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. చిన్న చిన్న చర్యలతో దేశానికి మేలు చేయవచ్చునని అన్నారు.

ప్రధాని పిలుపునకు విశేష స్పందన

అయితే, ప్రధాని మోదీ పిలుపునకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు తమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్నారు. తాజాగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రజా రవాణాకు ప్రాధాన్యమిచ్చి, కాన్వాయ్‌ని వాడకుండా రైలులో ప్రయాణించి కురుక్షేత్రకు వెళ్లారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి సైకిల్ తొక్కుతూ గురుకుల్ చేరుకున్నారు. ఆయన భద్రతా సిబ్బంది సైతం సైకిల్‌పైనే గవర్నర్‌ను అనుసరిస్తూ తమ విధులను నిర్వర్తించారు.

దిల్లీలో వర్క్ ఫ్రం హోమ్

మరోవైపు, దిల్లీ ప్రభుత్వం కూడా ఇప్పటికే అనేక పొదుపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. ప్రతి సోమవారం మెట్రోలో కార్యాలయాలకు రావాలని ఉద్యోగులకు సూచించింది. అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం కోత విధించింది.

# సంపాదకీయం

## జాతి నిర్మాణంలో 'జుగల్బందీ'లు

ఏడు సంవత్సరాల క్రితం (6 ఆగస్టు 2019) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో నా సహచరులతో పిచ్చాపాటీ చేస్తున్నాను. అంతకు ముందు రోజు పార్లమెంటు, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేయడం గురించి మా సంభాషణ సాగుతోంది. కంప్యూటర్ సైంటిస్ట్ అయిన నా యువమిత్రుడు ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'ఇప్పుడు మనం చూస్తుంది మోదీ రెండోపాలన ఆరంభం కాదు, అమిత్ షా మొదటి పాలన ప్రారంభం'. భారతదేశపు ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రమైన కశ్మీర్ స్థాయిని తగ్గించే పథక రచన, దాని అమలులో ప్రధానపాత్ర వహించింది కొత్త హోం మంత్రి అమిత్ షా అని మరి చెప్పనవసరం లేదు. అధికరణ 370 రద్దు అమిత్ షా పాలన ప్రారంభం అన్న వ్యాఖ్య ఒక అతిశయోక్తే. అయితే షా ఇప్పుడు భారత ప్రభుత్వంలో రెండో అత్యంత శక్తిమంతుడైన నాయకుడు మాత్రమే కాదు, ప్రధానమంత్రి మినహా మరెవరికీ లేని అధికారాలను పూర్తి స్వతంత్రతతో నిర్ణయాత్మకంగా చెలాయిస్తున్న నేత. మోదీషా జుగల్బందీ (ఇరువురి మధ్య అత్యంత సమన్వయంతో కూడిన రాజకీయ భాగస్వామ్యాన్ని సూచించే రూపకాలంకారమది) భారతీయ జనతా పార్టీ చరిత్రలోగానీ, స్వతంత్ర భారతదేశ పాలనా చరిత్రలోగానీ ప్రత్యేకమైనదేమీ కాదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్ మధ్య భాగస్వామ్యాన్నే చూడండి. అది సార్థకమైనది, ఆదర్శప్రాయమైనది. అయితే వర్తమాన రాజకీయాల తర్కవితర్కాలు ఆ శిఖర సమానులను ప్రత్యర్థులుగా, పరస్పర శత్రువులుగా చిత్రిస్తున్నాయి. నిజానికి వారిరువురూ నిస్వార్థ స్నేహితులు, సన్నిహిత సహచరులు. దేశ విభజన కల్లోలంలో వారిరువురు అధికార స్వార్థాలకు తావివ్వకుండా తమ తమ విధ్యుక్త ధర్మాలను కలసికట్టుగా నిర్వహించి ఉండకపోతే సమైక్య, ప్రజాస్వామిక భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించి వర్ధిల్లేదే కాదు. పటేల్ తన అసాధారణ రాజనీతిజ్ఞత, కార్యదక్షతతో భారతదేశాన్ని భౌగోళికంగా సమైక్యపరిచి, పరిపాలనా వ్యవస్థను ఆధునికీకరించారు. హిందూ మితవాదులను, వామపక్షీయులను నియంత్రించారు. డాక్టర్ అంబేడ్కర్ నిర్దేశకత్వంలో ఆరంభమైన రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియకు కాంగ్రెస్ నుంచి పరిపూర్ణ, ఫలప్రదమైన మద్దతు లభించేలా చూశారు. అదే సమయంలో లౌకిక ప్రజాస్వామ్య సమాజంగా భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో జవహర్‌లాల్ నెహ్రూ కీలకపాత్ర వహించారు. సమ్మిళిత పౌరసత్వాన్ని ప్రోత్సహించడం, మైనారిటీలకు సమాన హక్కులు కల్పించడం, జెండర్ సమానత్వాన్ని సమర్థించడం, సకల అంతరాలకు అతీతంగా వయోజన ఓటు హక్కు కల్పించడం మొదలైన ప్రగతిశీల కృషితో ఆసేతు హిమాచలం సమస్త భారతీయులలో భావోద్వేగ సమైక్యతను నిర్మించి పెంపొందించారు. పలు విషయాలలో నెహ్రూ, పటేల్ మధ్య విభేదాలు ఉన్నాయి. అయితే విశాల జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ విభేదాలను విస్మరించి వారు కలసికట్టుగా కృషి చేశారు. డాక్టర్ అంబేడ్కర్, ఇతర నాయకులు, సమర్థులైన సివిల్ సర్వెంట్ల సహాయ సహకారాలు వారికి నిస్వార్థంగా లభించేవి. నవభారత నిర్మాణంలో నెహ్రూపటేల్ భాగస్వామ్యం కీలకమైన, నిర్ణయాత్మకమైన పాత్ర వహించిందని చరిత్రకారులు ధ్రువీకరించారు. 1960వ దశకంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన ముఖ్య కార్యదర్శిగా మాజీ దౌత్యవేత్త పి.ఎన్.హక్సర్‌ను నియమించడంతో దేశ పాలనను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసిన రెండవ భాగస్వామ్యం ప్రభవించింది. ఇందిర కేబినెట్ మంత్రులలో మహాశక్తిమంతుడుగా హక్సర్ అతి కొద్ది కాలంలోనే పరిణమించారు. ఇందిరకు కుడి భుజంగా, ప్రభావశీల సలహాదారుగా ఆయన పేరు పొందారు. ఇందిరాగాంధీకి అజరామర కీర్తిప్రతిష్ఠలు సమకూర్చిన బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం విజయంలో హక్సర్ కీలకపాత్ర నిర్వహించారు. వ్యవసాయం, అంతరిక్ష రంగాలలో ఉత్కృష్టమైన పరిశోధనలను ప్రోత్సహించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని దెబ్బతీసిన ఇందిర ఆర్థిక విధానాల నిర్ణేత కూడా హక్సరే. 1975లో ప్రధాని ఇందిర తన రెండవ కుమారుడు సంజయ్‌గాంధీకి ప్రాధాన్యమిస్తూ హక్సర్‌ను తొలుత దూరంపెట్టి, ఆ తరువాత పూర్తిగా ఉపేక్షించారు. ఇలా మొదలైన ఇందిరసంజయ్ భాగస్వామ్యం భారత్ నిరంకుశ పాలనలోకి జారిపోవడానికి కారణమయింది. పౌర స్వేచ్ఛల అణచివేత జరిగింది. పత్రికా స్వాతంత్ర్యం హరించింది. న్యాయవ్యవస్థను ప్రభుత్వానికి అనుకూలంగా నియంత్రించారు. పౌర, పోలీసు అధికారులు తల్లీతనయులకు పూర్తిగా విధేయులు అవడం అనివార్యమయింది. ఇందిరహక్సర్ భాగస్వామ్యం వలే ఇందిరసంజయ్ భాగస్వామ్యం జాతి శ్రేయస్సుకు దోహదం చేసిన సార్థక విజయాలను సాధించలేదు. దేశ పాలనలో తదుపరి ప్రముఖ భాగస్వామ్యం ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్‌ది. 199196 సంవత్సరాల మధ్య ఈ నాయకద్వయం దేశ ఆర్థిక వ్యవస్థను లైసెన్స్‌పర్మిట్‌కోటా రాజ్ నుంచి విముక్తం చేశారు. దేశ ప్రజల ఆర్థిక, వ్యవస్థాపనా సామర్థ్యాలకు ఊపిరులు పోశారు. పీవీమన్మోహన్ భాగస్వామ్యం దేశ ప్రజల పేదరికాన్ని తగ్గించింది. మధ్యతరగతి ప్రజల సమున్నతికి తోడ్పడింది. ప్రపంచంలో దేశ ప్రతిష్ఠను ఇతోధికంగా పెంపొందించింది. పీవీమన్మోహన్ అనంతరం అటల్‌బిహారీ వాజపేయి లాల్‌కృష్ణ ఆడ్వాణీ రాజకీయ భాగస్వామ్యం రంగంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కు ప్రధాన సవాల్‌దారుగా బీజేపీని నిలబెట్టేందుకు 1980లు, 1990ల్లో ఈ నాయకద్వయం కలిసికట్టుగా కృషిచేసింది. 19982004 సంవత్సరాల మధ్య బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు వాజపేయి ప్రధానమంత్రి, ఆడ్వాణీ హోం మంత్రి. పీవీమన్మోహన్‌ల ఆర్థిక సంస్కరణలను వీరు కొనసాగించారు. ఈ కృషిలో వాజపేయిఆడ్వాణీకి జస్వంత్‌సింగ్, యశ్వంత్‌సింగ్ మొదలైన సమర్థనేతల

# బ్యాంకులు కలిసి వస్తేనే... సైబర్ నేరాలకు కళ్లెం!



సాంకేతిక అభివృద్ధి మానవాళికి ఎంతటి మహోపకారం చేస్తోందో, సరైన పర్యవేక్షణ కొరవడితే అది అంతటి ప్రమాదకరమూ అవుతుందని పెరుగుతున్న సైబర్ నేరాలే చాటిచెబుతున్నాయి. నేడు సైబర్ నేరాలు వ్యక్తుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే స్థాయి నుంచి ఏకంగా దేశార్థిక పునాదులకే సవాలు విసిరేంత స్థాయికి వెళ్లిపోయాయి. ఇలా కొల్లగొట్టిన సొమ్ము దేశ సరిహద్దులు దాటి సంఘ విద్రోహుల చేతుల్లోకి వెళ్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తేనే సైబర్ నేరాలను సమర్థంగా అరికట్టవచ్చు. కేంద్ర హోంశాఖ గణాంకాల ప్రకారం, గత నాలుగేళ్లలో సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.1.25 లక్షల కోట్ల మేర ప్రజల కష్టార్జితాన్ని కాజేశారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ప్రతి నెలా సగటున 1.75లక్షల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గడచిన అయిదేళ్లలో ఈ నేరాల తీవ్రత పదింతలు పెరిగిందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది సైబర్ నేరగాళ్ల మాయాజాలంలో చిక్కుతుంటే, ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 30వేల ఫిర్యాదులు నమోదవుతున్నాయి. రోజూ సగటున కోటి రూపాయలు నేరగాళ్ల పరం అవుతుండటమే కాదు, ఆ సొమ్ము సరిహద్దులు దాటిపోతుండటం దేశార్థిక భద్రతకు సవాలుగా నిలుస్తోంది. పైగా ఈ డబ్బులు డ్రగ్స్ అక్రమ రవాణా, ఉగ్రవాదం వంటి కార్యకలాపాలకు ఇంధనంగా మారుతుండటం జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమిస్తోంది.

### వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనం

సైబర్ నేరాల్లో 'మ్యూల్ ఖాతాలు' కీలకంగా మారడాన్ని ఇక్కడ గమనించాలి. దేశవ్యాప్తంగా సుమారు 180 కోట్ల బ్యాంకు ఖాతాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, బ్యాంకింగ్ వ్యవస్థలోని పర్యవేక్షణా లోపాలు నేరగాళ్లకు వరంగా మారుతున్నాయి. కేటుగాళ్లు నిరుపేదలు, విద్యార్థులకు అయిదు పది వేల రూపాయలు ఇస్తామని ఆశపెట్టి, వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. తరవాత వాటిని తమ అక్రమాలకు వాడుకుంటున్నారు. బ్యాంకులు కొత్త ఖాతాలు తెరిచే సమయంలో ప్రదర్శిస్తున్న ఉత్సాహం... ఆ తరవాత వాటిలో జరుగుతున్న లావాదేవీలను పర్యవేక్షించడంలో మృగ్యమవుతోంది. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న అసంబద్ధ టార్గెట్ల ఒత్తిడి సైతం ఇటువంటి అనర్థాలకు ఆజ్యం పోస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది ఖాతాల సంఖ్యను పెంచుకునే పోటీలో పడి, కేవైసీ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. కేవైసీ అనేది ఏదో లాంఛనంగా పూరించాల్సిన పత్రం కాదు, వినియోగదారుడి విశ్వసనీయతకు అదే అసలైన కొలమానం. కాబట్టి, బ్యాంకులు లాభాపేక్షతో పనిచేసే వ్యాపార సంస్థలుగానే కాకుండా, ప్రజల నమ్మకానికి వారధులమనే వాస్తవాన్ని గమనంలో ఉంచుకోవాలి. ఒక సాధారణ ఖాతాలోకి హఠాత్తుగా కోట్ల రూపాయలు వచ్చిపడుతున్నా, బ్యాంకింగ్ వ్యవస్థలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం- వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనం. బ్యాంకుల ప్రథమ లక్ష్యం సురక్షితమైన ఖాతాల నిర్వహణ అయి ఉండాలి. ఇందుకోసం ప్రతి బ్యాంకు ఉద్యోగి 'సేఫ్ కస్టమర్ ఛాలెంజ్', 'జీరో మ్యూల్ అకౌంట్ ఛాలెంజ్'లను స్వీకరించాలి. తమ పరిధిలో ఒక్క నకిలీ ఖాతాకూ ఆస్కారం లేకుండా కట్టుదిట్టం చేయాల్సిన బాధ్యతను ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులు తలకెత్తుకోవడం తక్షణావసరం. సైబర్ నేరాల మూలాలను ఛేదించే లక్ష్యంతో హైదరాబాద్ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' ఈ చీకటి సామ్రాజ్యపు గుట్టును రట్టు చేసింది. ఆపరేషన్ మొదటి దశలో 16 రాష్ట్రాల్లో విస్తరించిన 850 కేసులతో ముడిపడిన 350 మ్యూల్ ఖాతాలు బయటపడ్డాయి. 117 మంది కేటుగాళ్లు అరెస్టయ్యారు. రెండోదశలో భాగంగా తొమ్మిది రాష్ట్రాల్లో 16 ప్రత్యేక బృందాలు సోదాలు చేపట్టి వివిధ ప్రైవేటు బ్యాంకులకు చెందిన 32మంది అధికారులను అరెస్టు చేశాయి. కమీషన్లకు కక్కుర్తిపడి, నకిలీ పత్రాలతో మ్యూల్ ఖాతాలు తెరవడానికి కొందరు సిబ్బందే నేరగాళ్లకు సహకరించడం కంచే చేను మేసిన చందాన్ని తలపిస్తోంది. మహారాష్ట్రలోని నాసిక్‌లో బ్యాంకు ఉద్యోగి ఒకరు తన సహోద్యోగి లాగిన్ వివరాలను తస్కరించి మరీ అక్రమ ఖాతాలను ఆమోదించడం వ్యవస్థలోని డొల్లతనానికి నిదర్శనం.

### అవగాహన లేకుంటే అడ్డుకునేదెలా?

సైబర్ నేరాల గురించి చర్చించేందుకు 45 బ్యాంకుల ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో మరెన్నో చేదు వాస్తవాలు వెల్లడయ్యాయి. ఆర్‌బీఐ రీజినల్ మేనేజర్, వివిధ బ్యాంకుల జోనల్ అధికారులు పాల్గొన్న ఈ చర్చలో– క్షేత్రస్థాయి సిబ్బందికి సైబర్ నేరాల తీవ్రత గురించి కనీసపాటి అవగాహన కూడా లేదని తెలిసింది. ఇలాంటి నేరం జరిగిన వెంటనే స్పందించాల్సిన 'గోల్డెన్ అవర్' ఎంత విలువైనదో వారికి తెలియకపోవడం శోచనీయం! బాధితుల పట్ల కనీస సానుభూతి చూపకపోవడమే కాకుండా, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడంలో రోజులు తరబడి తాత్సారం చేయడమూ నేరగాళ్లకు వరమవుతోంది. నేరం జరిగిన వెంటనే నిధులను నిలిపేసే ఫ్రీజింగ్ చర్యల్లోనూ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం చూపడం, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ గురించి బాధితులకు సరైన మార్గదర్శనం చేయకపోవడంతో సామాన్యుల కష్టార్జితం క్షణాల్లో మాయమవుతోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో, బ్యాంకింగ్ వ్యవస్థలో మార్పులు కోరుతూ ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు ఇటీవల పలు కీలక సూచనలు చేశాం. కేవైసీ నిబంధనలను కఠినతరం చేయడం, కరెంట్ ఖాతాల ప్రారంభంలో డ్యూయల్ కంట్రోల్ విధానాన్ని తప్పనిసరి చేయడం, క్షేత్రస్థాయిలో నిబంధనల అమలుపై స్పెషల్ సిస్టమిక్ ఆడిట్ నిర్వహించడం వంటివి ఇందులో ఉన్నాయి. బ్యాంకులు కృత్రిమ మేధను ఉపయోగించి అనుమానాస్పద లావాదేవీలను రియల్ టైమ్‌లో గుర్తించాలనీ, నేరాలకు సహకరించే అధికారులను ఆర్థిక రంగం నుంచి శాశ్వతంగా నిషేధించాలనీ, పోలీసులూ అధికారులతో సంయుక్త కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేశాం. సరిహద్దులను కాపాడే సైన్యంలాగే, ప్రజల సంపదను రక్షించడంలో బ్యాంకింగ్ రంగం 'చివరి రక్షణ కవచం'గా నిలవాలి. ఖాతాల సంఖ్య కంటే వాటి నాణ్యతకూ, భద్రతకూ పెద్దపీట వేసినప్పుడే సైబర్ నేరాల ముప్పును సమర్థంగా అడ్డుకోగలం.

# ప్రధాని మోడీ పొదుపు విజ్ఞప్తి వెనుక అసలు కారణం ఏమిటి?




"ఏ కార్యక్రమం అయినా బంగారం కొనకండి. ఏడాది పాటు విదేశీ పర్యాటక యాత్రలు వాయిదా వేసుకోండి. పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించండి.. వీలైతే వర్క్ ఫ్రమ్ హోమ్ చేయండి.. ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లండి. వంటనూనెలలు సైతం తక్కువగా వాడండి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన విజ్ఞప్తితో దేశ ప్రజలు ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ప్రజలకు ఈ తరహా హెచ్చరిక కొత్త కావడంతో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందేమోనని ఆందోళన పడుతున్నారు.. కరోనా సమయంలో మోడీ టీవీ ముందుకు వచ్చారంటేనే చాలు హడలిపోయేవారు.. ఇప్పుడు కూడా కాస్తో కూస్తో అలాంటి ఫీలింగే కలిగింది. అసలు ప్రధాని ఈ తరహా వ్యాఖ్యలు చేయడానికి కారణం ఏంటి ఈ పొదుపు మంత్రం వెనుక ఉన్న మర్మం ఏంటి ఎన్నికలు అయ్యాకే ప్రకటించడం వెనుక అర్థం ఏమిటి ఈ అంశాలపై క్షుణ్ణంగా చర్చిద్దాం..

### డిమాండ్ తగ్గితేనే.. డాలర్ నియంత్రణ

గడిచిన కొద్ది కాలంగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నుంచి మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వరకు అన్నీ కూడా ప్రపంచ సరఫరా గొలుసును అస్తవ్యస్తం చేశాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, వంటనూనెల వాడకం తగ్గించాలని.. విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రభుత్వం కోరుతోందంటే.. దాని వెనుక ఉన్న ప్రధాన శత్రువు 'కరెన్సీ విలువ పతనం' తో పాటు 'విదేశీ మారక ద్రవ్య నిల్వల' రక్షణ అంశాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. సామాన్యుడికి అర్థమయ్యేలా చెప్పాలంటే, ఒక దేశం విదేశాల నుంచి ఏదైనా వస్తువును కొనాలన్నా లేదా విదేశాలకు వెళ్లి ఖర్చు చేయాలన్నా అది డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. మనం ఎంత ఎక్కువ పెట్రోల్ వాడితే, ఎన్ని ఎక్కువ లీటర్ల వంటనూనెను దిగుమతి చేసుకుంటే, ఎంత ఎక్కువగా విదేశాల్లో డాలర్లు ఖర్చు చేస్తే.. మన దేశం దగ్గర ఉన్న డాలర్ల నిల్వలు అంతగా తగ్గిపోతాయి. డాలర్లు తగ్గే కొద్దీ అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ బలహీనపడుతుంది. రూపాయి బలహీనపడితే వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ ద్రవ్యోల్బణ చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికే, ప్రజల భాగస్వామ్యంతో 'డిమాండ్' ను తగ్గించి, తద్వారా దేశం నుంచి బయటకు వెళ్లే డాలర్ల ప్రవాహాన్ని నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే, మోడీ వ్యాఖ్యలు దేశ ఆర్థిక వ్యవస్థ పతనాన్ని సూచిస్తాయని.. దీనివల్ల విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి వెళ్తారని ఇది దేశానికి తీవ్ర నష్టమన్న వాదనలు కూడా వస్తున్నాయి.

### బంగారం.. దేశానికి భారమే!

బంగారం కొనుగోళ్లపై ప్రధాని చేసిన విజ్ఞప్తి వెనుక ఒక బలమైన ఆర్థిక వ్యూహం ఉంది. భారతీయులకు బంగారం అనేది కేవలం ఆభరణం కాదు, అదొక సెంటిమెంట్, భద్రత. కానీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా చూస్తే బంగారం ఒక 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్'. మనం కొనే ప్రతి గ్రాము బంగారం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. దీనివల్ల మన విదేశీ మారక ద్రవ్యం భారీగా తరలిపోతుంది. ఆ బంగారం బీరువాల్లో లాక్ అయి ఉంటుంది తప్ప, అది దేశ ఉత్పత్తి రంగంలోకి గానీ, మౌలిక సదుపాయాల కల్పనలోకి గానీ రాదు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అనిశ్చితి సమయంలో, ప్రజలు తమ నగదును నిరుపయోగంగా ఉండే బంగారంపై కాకుండా, దేశీయ పొదుపు పథకాల్లో లేదా మార్కెట్లో పెట్టుబడిగా పెడితే అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది.

### ఇది భయపెట్టడమే.. రఘురామ్ రాజన్

'బంగారం కొనుగోళ్లు.. విదేశీ ప్రయాణాలను నియంత్రించడం వంటి అంశాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చాలా నిశ్శబ్దంగా, మార్కెట్ శైలిలో నిర్వహించాలి. ప్రధాని స్థాయి వ్యక్తి నేరుగా ప్రజలకు పిలుపునివ్వడం వల్ల మార్కెట్లలో అనవసరమైన ఆందోళన మొదలవుతుంది. ఇది విదేశీ ఇన్వెస్టర్లకు తప్పుడు సంకేతాలు పంపే ప్రమాదం ఉంది' అని మాజీ ఆర్బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఆయన వాదన ప్రకారం.. ప్రభుత్వం ఇలా నేరుగా ప్రజలను కోరడం అంటే 'దేశం దగ్గర డాలర్లు అయిపోతున్నాయి' అనే భ్రమను కలిగించే అవకాశం ఉన్నది. ఇది 2013 నాటి రూపాయి సంక్షోభాన్ని గుర్తుకు తెస్తున్నదని అభిప్రాయపడ్డారు.

### ముందు జాగ్రత్తలు అవసరమే.. వీకే విజయకుమార్

ముందస్తు జాగ్రత్తలు ఏ దేశానికైనా మంచిదేనని మోడీ కామెంట్ల నేపథ్యంలో జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ స్పందించారు. 'ప్రస్తుతం పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో కరెంట్ అకౌంట్ లోటును (సీఏడీ) మేనేజ్ చేయడానికి ప్రధానమంత్రి చేసిన ఈ పిలుపు ఒక క్రైసిస్ మేనేజ్‌మెంట్ చర్యగా కనిపిస్తున్నది. ఇది స్వల్పకాలంలో వృద్ధిపై స్వల్ప ప్రభావం చూపినప్పటికీ.. రూపాయి విలువ మరింతగా పడిపోకుండా కాపాడటానికి ఇది అత్యవసరం' అని పేర్కొన్నారు. ఈ విశ్లేషణ ప్రకారం, చమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్లకు చేరువవుతున్న తరుణంలో, పెట్రోల్.. బంగారం వాడకాన్ని తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దేశానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో అత్యవసర విషయం కానున్నది.

### ఎన్నికలు ముగిసాకే చెప్పాలా?

ఇరాన్ యుద్ధం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని ప్రభుత్వానికి ముందుగానే అంచనా ఉన్నదని.. అయినా, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేయలేదన్న వాదనలు వస్తున్నాయి. వాటికి ఆధారంగా.. ఎన్నికలు ముగిసిన తర్వాత బెంగాల్ బయట జరిగిన తొలి సభలోనే మోడీ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వండని ప్రజలను వేడుకోవడం హెచ్చరికలు చేయడం ఫక్తు రాజకీయ లబ్ధి కోసమేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ప్రజలు అడగకున్నా ఇస్తున్న ఉచిత పథకాలు రద్దు చేస్తే.. ఇటువంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమే ఉండదని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# మనసున్న మనిషి.. మానవీయ పథకాలు



మనసున్న మనిషి, తెలంగాణ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పేరు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. ఉద్యమ నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, పాలనలో కూడా అదే స్థాయి ప్రభావాన్ని చూపిందా? అంటే..నూటికి నూరుపాళ్లు అవుననే సమాధానమే వస్తున్నది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాన్ని కేవలం మాటల్లోనే కాకుండా, అమల్లో చూపించాలని సంకల్పించి అందుకు ఫలితాలు సాధించారు. పిల్లల నుంచి పండు ముదుసలి వరకు, రైతు నుంచి ఉద్యోగి వరకు, ప్రతి వర్గానికీ చేరేలా సంక్షేమ పథకాలను రూపొందించి, కొత్త గవర్నెన్స్ మాడల్‌ను తీసుకొచ్చారు. పాలన అంటే కేవలం అభివృద్ధి, ప్రాజెక్టులు కాదు, ప్రతి కుటుంబానికి భరోసా ఇవ్వటం కూడా ముఖ్యమని భావించిన కేసీఆర్ ముందుకు వచ్చారు. ఆ ఆలోచనల ఫలితంగానే సంక్షేమ పథకాల విస్తరణ చేపట్టి, సక్సెస్ అయ్యారు.తెలంగాణ వార్తలు గర్భిణులకు ఆరోగ్య భద్రత కల్పించటంతో పాటు, పుట్టిన శిశువుకు అవసరమైన మొదటి సంరక్షణ అందించాలనే ఉద్దేశంతో 2017లో కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద గర్భిణులకు సుమారు రూ.12 వేల నుంచి 13 వేల వరకు ఆర్థిక సహాయం అందించటంతో పాటు 16కు పైగా అవసరమైన వస్తువులు అందించారు. ఈ పథకం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు గణనీయంగా పెరిగాయి. లక్షలాది తల్లులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. కేసీఆర్ హయాంలో వెయ్యికి పైగా రెసిడెన్షియల్ గురుకులాలను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానాన్ని మెరుగుపరిచారు. ఈ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు కేసీఆర్ మానవీయ పాలనకు నిదర్శనాలు. మిషన్ కాకతీయ ద్వారా సుమారు 46,000 చెరువులను పునరుద్ధరించారు. దీంతో భూగర్భ జలాలు పెరగటం, సాగు విస్తీర్ణం పెరగటం వంటి మార్పులు చోటుచేసుకున్నాయి. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించారు. సమాజంలో బలహీన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేసీఆర్ ఆసరా పింఛన్లను పెంచారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకాన్ని ప్రారంభించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అమలు చేయటం దేశంలోనే ప్రత్యేకంగా నిలిచింది. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు ఇవ్వాలనే లక్ష్యంతో 2014లో టీఎస్-ఐ పాస్ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ విధానం ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. నిరుద్యోగులకు లక్షల సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభించాయి. ఉద్యోగావకాశాల సృష్టి ఆర్థిక అభివృద్ధికి దారితీసింది. సంక్షేమం అనే భావనను కేవలం మాటల్లోనే కాకుండా అమల్లో చూపించిన పాలన కేసీఆర్‌ది. తెలంగాణలో సంక్షేమం ఒక వ్యవస్థగా మారిన కాలం కేసీఆర్ హయాం. అందుకే మనసున్న మనిషి కేసీఆర్ మానవీయమైన పాలన, మహోన్నతమైన పథకాల కోసం ప్రజలు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారు.

## ఉరవకొండ మండలం పరిధిలో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్





ఉరవకొండ ,ఆంధ్రజననాడు,మే 15 : అనంతపురము జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఉరవకొండ మండలం పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ లైనింగ్ పనులను క్షేత్రస్థాయిలో శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. జిల్లాలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా, ఈ కాలువ లైనింగ్ పనుల పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గత సంవత్సరం చేపట్టడం జరిగిందనీ, ప్యాకేజ్ 88 నుండి 216.3 కిలోమీటర్ల పొడవునా కర్నూలు, అనంతపురం జిల్లాలో హంద్రీనీవా జలాలు ప్రవాహం ఉంటుందని, ఇందులో మన అనంతపురం జిల్లాలో 144 కి.మీ నుండి 216.3 కి.మీ పొడుగునా విస్తరించి ఉందని తెలుపుతూ ఇందులో ఎక్కడ కూడా గండ్లు పడకుండా సీపేజీ లీకేజీ లేకుండా లైనింగ్ పనులు జిల్లాలో 82 కిలోమీటర్ల పరిధిలో 6.50 కిలోమీటర్ల కాలువ లైనింగ్ పనులు గుర్తించి వాటి పనులు పురోగతిలో ఉన్న నేపథ్యంలో ఉరవకొండ మండలం కౌకుంట్ల, రామాపురం పరిధిలో జరుగుతున్న లైనింగ్ పనులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. సాగు నీరు రైతులకు ఇబ్బంది కాకుండా ఉండేందుకు వీటిని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుంతకల్ డివిజన్ శ్రీనివాస్ నాయక్,కాంట్రాక్టర్ ప్రతినిధి రామకృష్ణ యాదవ్, డిఈఈ రమణ, ఏఈలు సుదర్శన్ మూర్తి, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం..



యర్రగొండపాలెం పట్టణంలోని మండల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీ గూడూరి ఎరిక్షన్ బాబు గారు పాల్గొన్నారు. యర్రగొండపాలెం, ఆంధ్రజననాడు,మే 15 : ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా, వాటిని స్వయంగా పరిశీలించిన ఎరిక్షన్ బాబు గారు తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు. ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు,ఆావీజ చైర్మన్ చేకూరి సుబ్బారావు గారు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి గారు, మండల అధ్యక్షులు పొట్ల గోవిందు గారు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా బిజెపి నూతన అధ్యక్షులుగా.. పివి కృష్ణారావు

ఇటీవల నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు బిజెపి అధ్యక్షులుగా ఈరోజు పివి కృష్ణారావు గారిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గారు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.



మార్కాపురంఆంధ్రజననాడు,మే 15 : గతంలో పివి కృష్ణారావు గారు మార్కాపురం అసెంబ్లీకి ఇన్చార్జిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.వి కృష్ణారావు గారు మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ,బిజెపి పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేస్తానని వారు తెలియజేశారు.

## యర్రగొండపాలెం లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం' కార్యక్రమం



ఎర్రగొండపాలెం,ఆంధ్రజననాడు,మే 15 : యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బోయలపల్లి మరియు అమానిగుడిపాడు సెక్టార్లలో "కిశోరి వికాసం" కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది ముఖ్య అతిథులు పర్యవేక్షణ ఈ కార్యక్రమం యర్రగొండపాలెం ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీమతి హేమలత భాస్కర్ ఆదేశాల మేరకు, బోయలపల్లి మరియు అమానిగుడిపాడు సెక్టార్ల సూపర్ వైజర్ ఏ. పద్మజ ప్రత్యక్ష ఆధ్వర్యంలో జరిగింది. బోయలపల్లి సెక్టార్ బోయలపల్లి గ్రామం అమానిగుడిపాడు సెక్టార్ వాదంపల్లి గ్రామం లో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా "నా అవసరాలు మరియు మన సవాళ్లు" అనే ప్రధాన అంశంపై కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఏ. పద్మజ బాలికలను ఉద్దేశించి పలు కీలక విషయాలను వివరించారు శారీరక, మానసిక మార్పులపై అవగాహన: కిశోర ప్రాయంలో (టీనేజ్) బాలికలలో వచ్చే శారీరక, మానసిక మార్పులను ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఈ వయసులో బాలికలు పాటించాల్సిన ఆరోగ్య మరియు వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పోషకాహారం ప్రాధాన్యత రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ఐసీడీఎస్ ద్వారా అందించే పోషకాహార విలువలు, ఆకుకూరలు, గుడ్లు మరియు పౌష్టికాహారం తీసుకోవడం ఎంత అవసరమో తెలియజేశారు. సమాజంలో సవాళ్లు రక్షణ బాలికలు ఎదుర్కొంటున్న సామాజిక సవాళ్లు, బాల్య వివాహాల నివారణ, మరియు తమను తాము రక్షించుకోవడానికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా గ్రామాల కిశోర బాలికలు, మహిళలు మరియు గర్భిణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బోర్‌వెల్స్ వాహనాలకు టాక్స్ మినహాయింపు ఇవ్వండి

### మంత్రి నారా లోకేష్ కు విన్నవించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సిమెంట్ పోలన్న



అనంతపురం, ఆంధ్రజననాడు,మే 15 : తమిళనాడు తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా బోర్‌వెల్స్ వాహనాలకు టాక్స్ మినహాయింపు ఇవ్వాలని మంత్రి నారా లోకేష్ కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న కోరారు. శుక్రవారం విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అనంతపురం జిల్లాకు కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన సందర్భంగా ఎయిర్ పోర్ట్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం జిల్లావ్యాప్తంగా వడ్డెర్లకు సంబంధించి శ్రీ వెంకటరమణ బోర్‌వెల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 500 బోర్‌వెల్స్ నిర్వహిస్తున్నామని, దీని ద్వారా దాదాపు పది వేల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని బోర్ వెల్స్ కు సంబంధించి వార్షిక టాక్స్ మినహాయింపులు తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానంలా బోర్‌వెల్స్ పై విధిస్తున్న టాక్స్‌కు మినహాయింపు కల్పించాలని మంత్రిని కోరారు. తమిళనాడులో సంవత్సరానికి రూ.3,500 మాత్రమే చెల్లిస్తున్నప్పటికీ, మన రాష్ట్రంలో ప్రతి 3 నెలలకు ఒకసారి రూ.3,500 నుంచి రూ.5,800 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. దీనివల్ల బోర్‌వెల్స్ యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి టాక్స్ భారం తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వడ్డెర్లకు సంబంధించి క్రషర్లు, కొండ క్వారీలలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని వడ్డెర్లను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

### రైతులకు పంటలపై అవగాహన కల్పించాలి..

### అనంత పాల దాణ పథకం ద్వారా లబ్ధి పొందాలి..

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం, ఆంధ్రజననాడు,మే 15 : రైతులకు పంటలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కనేకల్ మండలం సోల్లాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అనంత పాల దానా పథకం పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురు రైతులకు పశు దాన బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ మరియు ఉద్యాన శాఖ అధికారుల ద్వారా వివిధ పంట సాగు లపై అవగాహన పెంచుకొని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రీ మాన్సూన్ డ్రైషోన్ (పీఎండీఎస్) గురించి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా రాబోయే రోజుల్లో కనేకల్ మండలం లో వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతుల ముందస్తుగా పలు రకాల విత్తనాలను సీజన్ కు ముందుగా వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ ను రైతులందరూ ప్లే స్టోర్ లో డౌన్లోడ్ చేసుకొని అవగాహన కలిగి



ఉండాలన్నారు. ప్రస్తుతం వల్లభా కంపెనీ ద్వారా తయారయ్యే పశు ధానాను మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ విధానం వల్ల రైతులకు నాణ్యమైన దానా తక్కువ ధరలో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. సదరు సరఫరాను పిఏసిఎస్ గోదాముల ద్వారా అమలు చేస్తూ రెండు వారాలలో రైతులుగా అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మార్కెట్ లో రూ.1350 ఉండగా 50 కేజీల దాన బస్తాను ప్రభుత్వం రూ.1125 లకే అందిస్తూ ఒక బస్తాపై రూ.225 ఆదా (సుమారు 16.7%) కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయపరంగా రైతులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వర్షాలు మొదలైన వెంటనే ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్ విధానాన్ని అనుసరించాలన్నారు. తద్వారా వెంటనే విత్తనాలు మొలకెత్తి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని తద్వారా రైతులు లబ్ధి పొందవచ్చును అన్నారు. అలాగే పశువులో మంచి పోషకాన్ని పెంచుకోవడానికి మంచి సమయం అని అన్నారు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఇది ఎంతో ప్రయోజనాకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా నీటి వనరులను సమర్థంగా వినియోగించేందుకు ట్యాంక్ బెడ్ కల్టివేషన్ పై దృష్టి పెట్టాలని సూచించారు చెరువుల అడుగు భాగంలో పశుగ్రాసాన్ని వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జలజారా కార్యక్రమంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారించేందుకు పైపులైన్ల ద్వారా మరమ్మత్తులు మరియు నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంపై గ్రామస్తులతో పలు అంశాలపై కలెక్టర్ చర్చించారు. మైక్రో ఇరిగేషన్ ( బిందు సేద్యం) కోసం ఎటువంటి పరిమితులు లేవని ఎంతమంది రైతులైనా దరఖాస్తు చేసుకొవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది దాదాపు 23 వేల హెక్టార్లలో సుమారు 60 వేల ఎకరాలు మైక్రో ఇరిగేషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వంద్వారా వ్యవసాయ పనిముట్ల మంజూరు లో భాగంగా ట్రాక్టర్లు స్ప్రేయర్లు వంటి వ్యవసాయ పరికరాల కోసం కూడా ప్రభుత్వం రైతులు కల్పిస్తోందని రైతులు వీటిని సద్వినియం చేసుకోవాలని సూచించారు. దళారీల ప్రమేయం లేకుండా మధ్యవర్తులు లేకుండా నేరుగా కంపెనీల నుంచి రైతులకు లబ్ధి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కలెక్టర్ తో మాట్లాడుతూ అందిస్తున్న ఫీడ్ వాడడం వల్ల పాలు ఉత్పత్తి పెరగడంతో పాటు పశువుల గర్భాధారణ శాతం కూడా మెరుగుపడుతున్నట్లు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.ప్రేమ్ చశీద్ డిప్యూటీ డైరెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి డా.శైలజ డా.వెంకటరెడ్డి పలువురు రైతులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి...

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

కనేకల్ మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణపు పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఎటువంటి అవసరం లేకుండా నాణ్యమైన పనులతో కూడిన గదులను నిర్మించాలని ఈ రమణారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో షేక్షావలి నాయకులు వన్నారెడ్డి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి పరిపాలపరమైన విషయాలపై పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.

# ఆదిలాబాద్ ఎదను చీల్చే కుతంత్రం

ఆదిలాబాద్ ప్రజలు ఎన్నడూ చూడని ఒక విపత్కర పరిస్థితిలో చిక్కుకున్నారు. వారికే తెలియని ఈ ఘోర మానవ హనన కార్యక్రమంలో బలి అవుతున్నారు. అయితే, ఈ విధ్వంసానికి ఇక్కడి ప్రజల ప్రతిస్పందన లేకపోవడం విచారకరం. బాలగోపాల్ అన్నట్లు ఆదిలాబాద్ ప్రజల జీవన విధానం నెమ్మదైనది. నిజంగా ఇంత నెమ్మదా? తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంటే, కనీసం నిరసన ప్రకటించని మంచితనం ఏమిటి? ఆదిలాబాద్‌లో ఇండస్ట్రియల్ పార్క్, విమానాశ్రయాల పేరుతో ప్రజలు పెద్ద ఎత్తున నిర్వాసితులు కానున్నారు. గతంలో ఆదివాసీలు వలసలు, ఆధునిక అభివృద్ధికి దూరంగా జరుగుతూ దట్టమైన అడవుల్లోకి వెళ్లిపోయారు. కానీ నేడు అడవి, భూములు రెండూ లేవు. ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం అభివృద్ధి పేరిట జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడకపోతే ఇటు మైదాన ప్రాంత ప్రజలు, అటు

### ఆదివాసీలకు మనుగడ ఉండదు.

కొరాట-చనాక ప్రాజెక్టు పూర్తయ్యే సందర్భంలో, ఆ ప్రాజెక్టు కింద ఉన్న భూములను ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం ఆక్రమించుకుంటున్నది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న భూములు చాలావరకు బినామీల పేరు మీద రిజిస్టర్ అయ్యాయి. చాలా ఊర్లలో బినామీల జాతర నడుస్తున్నది. పెద్దఎత్తున సాగు భూములకు మంగళం పాడుతుంటే..వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు ఎందుకోసం? ఇప్పటికే రైతులకు నామమాత్రంగా చెల్లింపులు చేసి 3000 ఎకరాల భూములను బడాబాబులు సొంతం చేసుకున్నారు. జనసాంద్రత ఎక్కువగా లేని ఆదిలాబాద్‌కు మొదట 300 ఎకరాల్లో పౌర విమానాశ్రయం నిర్మిస్తామని పాలకులు చెప్పారు. అవసరం లేకున్నా ప్రజలు ఓర్పుతో అంగీకరించారు. నిర్మాణ వ్యయం రీత్యా కేంద్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతమైన ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మించటం వల్ల పెద్దగా ఒనగూరే ప్రయోజనం లేదనుకున్నది. అందుకే ఎన్నో ఏండ్లపాటు దీనికి ఆమోదం తెలుపలేదు. దీని వ్యయాన్ని భరించలేక రక్షణశాఖ, పౌరవిమానయానశాఖ సంయుక్తంగా నిర్మిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. తాజాగా 300 ఎకరాలకు బదులుగా 2,000 ఎకరాలతో రక్షణశాఖ వారి కోసం విమానాశ్రయం, టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని అంటున్నారు. దీంతో ఒక్కసారిగా విమానాశ్రయం ప్రణాళిక మారిపోయింది. ఎన్నో ఏండ్లుగా సీసీఐ (సిమెంట్ పరిశ్రమ)ను పునరుద్ధరిస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు ఆ భూములకు ఇప్పుడు ఎసరు పెట్టారు. ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ-మూతపడిన సీసీఐని పునః ప్రారంభించాలని, మళ్లీ తెరిపించడానికి వివిధ సందర్భాల్లో వారు ఎన్నో పోరాటాలు చేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని ప్రజాప్రతినిధులు గత దశాబ్దకాలంగా ఊరిస్తూ వచ్చారు. ఎప్పటికైనా సిమెంట్ పరిశ్రమ తెరుస్తరని, తమ బిడ్డలకు కొలువులు వస్తయనే ఆశతో ప్రజలుంటే.. తేరగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 1,700 ఎకరాల సీసీఐ భూములను రక్షణరంగ శాఖకు బదిలీ చేసే పెద్ద



కుట్రను తెరపైకి తీసుకువచ్చారు. ఉత్పత్తి రంగానికి పెద్దపీట వేయవలసిన ప్రభుత్వం, సీసీఐని శాశ్వతంగా ప్రజల మనోఫలకాల నుంచి తుడిచివేసే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఇటు ఎయిర్‌ఫోర్స్ అథారిటీ అధికారులతో సర్వే చేయిస్తూ, అటు సీసీఐ యంత్ర సామగ్రిని తుక్కుగా మార్చి అమ్మేస్తున్నారు. ఆదిలాబాద్ ప్రజలు సీసీఐని 'ఆదిలాబాద్ షాన్'గా చూశారు. సీసీఐ భూముల జోలికి ఎప్పుడూ పోలేదు. ఒకప్పుడు నామమాత్ర పరిహారంతో సీసీఐకి భూములిచ్చిన రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు. సీసీఐ పరిశ్రమ కోసం బంగారం పండే భూముల్ని ఆనాడు ఇచ్చిన రైతులు సీసీఐ అభివృద్ధి కోసం ఎంతో త్యాగం చేశారు. కానీ వారి త్యాగానికి విలువ లేకుండా పోయింది. సీసీఐని పునరుద్ధరించలేని పక్షంలో కేంద్ర ప్రభుత్వం ఆ భూములను రైతులకు తిరిగి అప్పజెప్పాలి. సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయటం లేదని అధికారికంగా ప్రకటించాలి. సర్వం కోల్పోయిన రైతులు, వారి బిడ్డలు ఈ భూములను సాగుచేసుకునే అవకాశం లభిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు బెంగాల్‌లోని సింగూరులో పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే రైతులకు ఆ భూములు తిరిగి అప్పజెప్పాలని పేర్కొన్నది. ఇది సహజ న్యాయం. రక్షణశాఖ 1,700 ఎకరాల భూములను తీసుకొని ఆదిలాబాద్‌కు విధ్వంస రచన చేస్తున్నది. అందులో '20 వేల కోట్ల లీటర్ల రీఫిల్లింగ్ స్టేషన్' కడతామని అంటున్నారు. దీనివల్ల ఏ చిన్న ప్రమాదం జరిగినా ఆదిలాబాద్ పట్టణం భస్మీపటలం అవుతుంది. తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఈ నిర్మాణాన్ని అడ్డుకున్నాయి. ఎయిర్‌పోర్ట్ అయితే ఇక్కడ ప్రయాణించే నాథుడే ఉండదు కాబట్టి ఈ రీఫిల్లింగ్ స్టేషన్‌కు కాపలా కాయడానికి రక్షణశాఖ అవసరం ఏర్పడింది.అవసరం లేని ఎయిర్‌పోర్ట్ పేరుతో రక్షణశాఖ ఆడుతున్న వింత నాటకం. ఇలాంటి రక్షణ వ్యూహాలను బంజరు భూములు, జనావాసాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలి. ఆదిలాబాద్ పట్టణం, వివిధ గ్రామాలకు మధ్యన ఇటువంటి నిర్మాణాలు చేపట్టడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అవుతుంది. ఇలాంటి ప్రాజెక్టు కోసం పచ్చని అడవి, పంట పొలాలతో అలరారుతున్న ఆదిలాబాద్, పరిసర ప్రాంతాలను ఎంచుకోవటం సరికాదు. ఇది తీవ్ర పర్యావరణ సంక్షోభానికి దారితీస్తుంది. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయానికి 300 ఎకరాలు సరిపోతున్నపుడు, ఆదిలాబాద్‌ను ఎందుకు విధ్వంసం చేస్తున్నట్టు? ఇక్కడి ప్రజలు రైతులు, అమాయకులు, వారికేం తెలియదు, ఏమి చేసినా సహిస్తారని ఈ దారుణానికి ఒడిగట్టారా? ఎయిర్‌పోర్ట్, రీఫిల్లింగ్ ఫ్యూయల్ స్టేషన్‌ల వల్ల ప్రజలు వివిధ ఆంక్షలతో ఎన్నో అవస్థలు పడాల్సి ఉంటుంది. పని దొరకదు, జీవన వ్యయాలు విపరీతంగా పెరుగుతాయి. వివిధ వనరులు అడవులు కలిగి, పుష్కలంగా పంటలు పండే ఆదిలాబాద్ జిల్లాను ఇంకా ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చో పాలకులు ఆలోచించాలి. అభివృద్ధి సంగతి ఏమోగానీ, కనీసం నాశనం చేయకపోతే అదే మహాభాగ్యం అనిపిస్తున్నది.

## అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల ధన్యవాదాలు..

### జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి ఆంధ్రజననాడు,మే 15 : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద గురువారం అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణపల్లి వద్ద అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చివరగా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ మరియు వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో భాగంగా, భారతదేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే దిశగా శ్రీ సత్యసాయి జిల్లాలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ మరియు ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ కి శంకుస్థాపన చేసినందుకు గాను కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అలాగే, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్‌తో పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బృహత్తర ప్రాజెక్టు కోసం ముందుకు వచ్చి సహకరించిన రొద్దం మండలం, దొమ్మలపల్లి గ్రామ ప్రజలకు



మరియు భూ యజమానులకు నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావడం చాలా గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వివిధ సంస్థల ప్రతినిధులకు, అధికారులకు, భద్రతా సిబ్బందికి మరియు మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్ర జననాడు

శనివారం-16 - మే - 2026

## బాబా స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం డిఫెన్స్ ప్రాజెక్ట్ తెచ్చింది

### - భారతదేశ ఐరన్ మ్యాన్ రాజ్ నాథ్ సింగ్

– వాళ్లది ఫ్యాక్షన్ బ్యాక్ గ్రౌండ్ – మనది ఫైటర్ జెట్ బ్యాక్ గ్రౌండ్ – ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్




పుట్టపర్తి : శ్రీ సత్య సాయి బాబా స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పుట్టపర్తికి డిఫెన్స్ ప్రాజెక్ట్ తెచ్చిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమంలో నారా లోకేష్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా దేశానికే రక్షణ శక్తికి నయా కేంద్రంగా తయారవుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికే ఈ ప్రాజెక్టు తెచ్చామన్నారు. కరువు నేలపై రక్షణ ప్రాజెక్టులు వచ్చాయని పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. ఈ నేలపై కియా ప్రాజెక్టు తెచ్చిన నేత చంద్రబాబు నాయుడు అని, గతంలో శ్రీ సత్య సాయి బాబా పుట్టపర్తిలో విమానాశ్రయం నిర్మిస్తుంటే అందరూ అవసరమా అని అడిగారని, బాబా స్ఫూర్తితో పుట్టపర్తికి కూటమి ప్రభుత్వం డిఫెన్స్ ప్రాజెక్టు తెచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ జి లు 75 ఏళ్ల కుర్రవాళ్ళు అని వారి స్పీడ్ ఇప్పటికీ ఎవరు అందుకోలేరన్నారు. గూగుల్, ఆర్సిలార్ మిట్టల్ లాంటి లక్షల కోట్ల ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ కు వచ్చాయని, త్వరలో కర్నూలులో హైకోర్టు బెంజ్ ఏర్పాటు కాబోతుందన్నారు. పురుగు రాష్ట్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్ ను చూసి అసూయపడే పరిస్థితి తీసుకు వచ్చాం అని, రాయలసీమతో పాటు రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. జువ్వల దిన్నే లో సాగర్ డిఫెన్స్ వచ్చిందని, పుట్టపర్తికి ఏడిఏ ప్రాజెక్టును తీసుకువచ్చాం అన్నారు. పుట్టపర్తి లో ఐదవ తరం ఆధునిక యుద్ధ విమానాల ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్ట్ వచ్చిందని, ఇతర డిఫెన్స్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు కూడా ఇక్కడికి వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వైకాపా వాళ్ళది ఫ్యాక్షన్ బ్యాక్ గ్రౌండ్ అని మనది ఫైటర్ జెట్ బ్యాక్ గ్రౌండ్ అన్నారు. వాళ్లది క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ కాగా మనది కియా బ్యాక్ గ్రౌండ్ అన్నారు.

## కిషోరి వికాసంతో వ్యక్తిత్వ వికాసం

యాడికి :యాడికి మండల కేంద్రంలోని ఆర్డిటి పాఠశాలలో కిషోరి వికాసంపై బాలబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తాడిపత్రి ఆర్‌డిటి ఏటీఎల్ లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీనేజ్ దశలో వచ్చే శారీరక, మానసిక మార్పులు, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, విద్య ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ కిషోర్ వికాసం కార్యక్రమం యువతలో వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం,సామాజిక చైతన్యం పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టి విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హేమావతి, సీబీటీ సభ్యులు విజయలక్ష్మి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

## బరువుగా కాదు.. బాధ్యత గా స్వీకరించండి ఆర్.జె.డి నాగమణి...



గన్నవరం : ప్రభుత్వం విద్యా శాఖ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలు బడి బయట కాదని బడి లోపల అంటూ వారికి కావాలససిన అన్ని రకాల వసతులను కల్పిస్తూ విద్యలో ప్రోత్సహిస్తున్న విషయాలను తల్లి దండ్రుల దృష్టిలో పెట్టేది ఉపాధ్యాయులు బరువు గా కాకుండా బాధ్యత తీసుకోవాలని కాకినాడ ప్రాంతీయ విద్యా సంచాలకులు నాగమణి అన్నారు. శుక్రవారం నాడు గన్నవరం చెంచులకాలనీ లో కేసులు బడి పిలుస్తుంది... రా ప్రత్యేక కార్యక్రమం లో ఆమె ర్యాలీ లో పాల్గొని తల్లి దండ్రులను చైతన్య పరిచారు. ప్రభుత్వ బడి లో తమ పిల్లను చేర్చడం వలన ప్రభుత్వం యూనిఫామ్, బలవర్ధకమైన మధ్యాహ్నభోజనం, అమ్మ ఒడి. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన, తదితర అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రయివేటు పాఠశాల రంగులను చూసి ఆకర్షితులు కావద్దని ఆమె తల్లి దండ్రులకు తెలిపారు. ఉపాధ్యాయులు పదవతరగతి అడ్వాన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించే వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. నాగమణి ఇంటింటికి తిరిగి బడి పిలుస్తుంది..... రా అంటూ తిరుగుతుంటే తల్లి దండ్రులు ఆశ్చర్యం గా చూస్తూ తమ పిల్లను బడికి పంపుతామని తెలిపారు. గుడివాడ ఉపవిద్యశాఖధికారి కొండా రవి కుమార్ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖధికారి 2 ఆర్. కమల, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఏ. సునీల పలువురు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మండల విద్యా శాఖ వివరాలను నాగమణి తెలిపారు.. విద్యార్థులను లౌక్యంగా మంచి మాటలతో పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నాగమణి పిలుపునిచ్చారు. అనంతరం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో సర్కారు బడి నిన్ను పిలుస్తుంది నిను రా... రమ్మని అని ప్రచారం రథం బయలుదేరి వెళుతుంటే పిల్లలు ఉత్సాహంగా ఉరుకులు తీశారు.



## ఘనంగా అంబేద్కర్ వాది చింతపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

### హాజరైన మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు

### పూలమాలలు, దుశ్శాలువాతో ఘన సత్కారం...



తోట్లవల్లూరు, : ప్రముఖ అంబేద్కర్ వాది చింతపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం వల్లూరుపాలెంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వెంకటేశ్వరరావుకు పూలమాలలు వేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఈ సందర్భంగా గోగులమూడి రాజు మాట్లాడుతూ..**

రెండు దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వెంకటేశ్వరరావు చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. దళిత, గిరిజన, మహిళా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మాల మహానాడు సీనియర్ నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, బేతాళ అజయ్ బాబు, వల్లే ఆనంద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు...

## పేదలకు రాచూరి ఫౌండేషన్ అండ అంత్యక్రియలకు ఆర్థిక సాయం



కంకిపాడు: పేదలకు, నిరాశ్రయులకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాచూరి ఫౌండేషన్ అధినేత చిరంజీవి అన్నారు. స్థానిక లాకుల వద్ద ఓ వ్యక్తి మృతి చెందారు. ఆ నిరుపేద కుటుంబం అంత్యక్రియలు నిర్వహించలేని ఆపన్న స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న చిరంజీవి తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి అండగా నిలబడి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడం తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఫౌండేషన్ చేసిన ఈ సాయంపై మృతుడి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశాజ్యోతి ఆశ్రమంలో ఘనంగా మల్లికార్జున్ జన్మదిన వేడుకలు..

### మానసిక వికలాంగులకు ఆహార పంపిణీ..

### కిరణ్ కుమార్ సేవలు అమోఘం: మరీదు వెంకటస్వామి ప్రశంసలు..



హనుమాన్ జంక్షన్,: : స్థానిక ఆశాజ్యోతి ఆశ్రమంలో రోహన్ ఐ కేర్ అధినేత నక్క మల్లికార్జునరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ లోని రోహన్ ఐ కేర్ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు పుట్టినరోజును పురస్కరించుకొని ఆశ్రమములోని మానసిక వికలాంగులైన పిల్లలకు ఆహారం, పండ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టైమ్స్ పవర్ ఎడిటర్ బాపట్ల కిరణ్ కుమార్, పెన్ షాట్ జిల్లా ఇన్చార్జి రేమల్లి రాజేష్ హాజరయ్యారు.

**ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ...,**



మానసిక వికలాంగులైన పిల్లల మధ్య తన జన్మదినాన్ని జరుపుకోవడం ఎనలేని సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

**టైమ్స్ పవర్ ఎడిటర్ బాపట్ల కిరణ్ కుమార్ మాట్లాడుతూ...,**

సమాజంలో వెనుకబడిన, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మల్లికార్జునరావు తన పుట్టినరోజున హంగూ ఆర్భాటాలకు పోకుండా, ఆశ్రమ పిల్లల చెంతకు వచ్చి సేవ చేయడం అభినందనీయమన్నారు.

**పెన్ షాట్ జిల్లా ఇన్చార్జి రేమల్లి రాజేష్ మాట్లాడుతూ,**

మల్లికార్జునరావు సేవా దృక్పథం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన ముందుండడం సంతోషకరమన్నారు.

**ఈ సందర్భంగా ఆశాజ్యోతి చైర్మన్ మరీదు వెంకట స్వామి మాట్లాడుతూ..**

బాపట్ల కిరణ్ కుమార్ గతంలోనూ ఆశ్రమానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. గత నెల ఏప్రిల్ 14న భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆశ్రమానికి బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు, మజ్జిగ ప్యాకెట్లను



విరాళంగా అందించారని తెలిపారు. మళ్లీ అదే స్ఫూర్తితో ఈరోజు తన మిత్రుడు మల్లికార్జునరావు పుట్టినరోజు వేడుకలను ఆశ్రమ పిల్లల మధ్య ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఆశ్రమ పిల్లలకు ఆహారంతో పాటు పండ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఆశ్రమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారి సంతోషంలో భాగస్వాములైన బాపట్ల కిరణ్ కుమార్, మల్లికార్జునరావు బృందానికి ఆశ్రమ నిర్వాహకులు, పిల్లల తరపున వెంకట స్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పిల్లలందరూ మల్లికార్జునరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సెక్రెటరీ మాధవి లత, ప్రతినిధులు మరీదు వీరయ్య, తేజ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భారత గగన శక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి యుద్ధ విమానాలు టేక్ ఆఫ్ అవుతాయి

### – త్రివిధ దళాలకు ఆయుధ టెక్నాలజీ ఆంధ్ర ప్రదేశ్ నుంచి అందించబోతున్నాం

### – మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ గా పుట్టపర్తి ప్రాంతం.

### రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్

పుట్టపర్తి : భారత గగన శక్తిని, రక్షణ శక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి యుద్ధ విమానాలు టేకాఫ్ అవుతాయని దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తి పట్టణ సమీపంలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ శంకుస్థాపన అనంతరం జరిగిన బహిరంగ సభలో రక్షణ మంత్రి మాట్లాడుతూ పుట్టపర్తి లాంటి ఆధ్యాత్మిక కేంద్రంలో ఏర్పాటు అవుతున్న ఈ ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్ తో సహా దేశ రక్షణ చరిత్రలో ఓ చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడించబోతుందన్నారు. ఈ తరహా యుద్ధ విమానాలను పుట్టపర్తి నుంచి తయారు చేయబోతున్నాం అని, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా 480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పేడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న చాలా యుద్ధ పరికరాలను ఇక్కడే స్వదేశీయంగా తయారు చేసుకోగలం అని, మన సముద్ర తీర ప్రాంతాలకు పూర్తి రక్షణతో పాటు బ్లూ ఎకానమీకి ఊతం ఇచ్చేలా ఈ ప్రాజెక్టు మారబోతుందన్నారు. భారత్ పోర్ట్ అనుబంధ సంస్థ ఆగ్నేయాస్త్ర ఆధునిక ఆయుధాలను తయారు చేస్తుందని, 1500 కోట్ల పెట్టుబడితో భవిష్యత్తులో యుద్ధానికి అవసరమైన ఆధునిక వ్యవస్థలు ఇక్కడ తయారవుతాయన్నారు. హెచ్ఎఫ్ ఏసిఎల్ 1294 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ ఫ్యూజ్ లు తయారు చేస్తుందని, 8 డ్రోన్ కంపెనీలు ఓ డ్రోన్ సిటీని ఏర్పాటు చేస్తున్నాయని, మేక్ ఇన్ ఇండియాను బలోపేతం చేసేలా ఈ ప్రాజెక్టులు రాబోతున్నాయన్నారు. డ్రోన్ టెక్నాలజీ ఆధునిక వార్ ఫేర్ లో ఓ గేమ్ చేంజర్ గా మారిందని, వీటితోపాటు వ్యవసాయం సహా వేర్వేరు అవసరాలకు వీటి ఉపయోగం ఉంటుందన్నారు. సూరత్ డైమండ్ సిటీగా, బెంగళూరు సిలికాన్ వ్యాలీగా పేరు పొందాయని భవిష్యత్తులో కర్నూలు కూడా ప్రపంచ డ్రోన్ హబ్ గా ప్రసిద్ధి చెందుతుందన్నారు. ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ లాంటి త్రివిధ దళాలకు అవసరమైన ఆయుధాలు, టెక్నాలజీని ఆంధ్రప్రదేశ్ నుంచి తయారు చేయబోతున్నాం అని, మన రక్షణ దళాలకు పూర్తి శక్తి సామర్థ్యాలు అందించేలా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయి అన్నారు. దేశ రక్షణ రంగంలో సంపూర్ణ స్వావలంబన లక్ష్యంగా ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసాం అని, ప్రభుత్వ రంగ సంస్థలు – ప్రైవేట్ రంగం సంయుక్తంగా పనిచేసే ఒక దేశంగా రక్షణ రంగ ప్రగతి వైపు కదులుతున్నామన్నారు. పరిశ్రమలు, స్టార్టప్ లు, సంస్థలు అన్నీ కలిసి జన విప్లవంగా మారి దేశ అభివృద్ధి అనే మహా యజ్ఞం కోసం పనిచేస్తున్నాం అని, ఈ ప్రజా ఉద్యమం ఆంధ్ర ప్రదేశ్ లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నైపుణ్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. దేశానికి మిలట్రీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ గా ఈ ప్రాంతాన్ని తయారు చేసేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. బెంగళూరుకు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతాన్ని సైనిక పారిశ్రామిక సముదాయంగా మారిస్తే దేశ అభివృద్ధికి కీలకం అవుతుందని, గతంలో భారత్ అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉండేదని, గడచిన పది సంవత్సరాల నుంచి తీసుకున్న చర్యలతో పరిస్థితి మరిందన్నారు. గతంలో కేవలం 46 వేల కోట్ల విలువైన ఆయుధాలు మాత్రమే తయారు అయ్యేవని, ప్రస్తుతం 1.54 లక్షల కోట్ల విలువైన ఆయుధ ఉత్పత్తి జరుగుతుందన్నారు. మరికొన్ని రోజులలో ఇది 1.75 లక్షల కోట్లు ఉత్పత్తికి చేరుతుందన్నారు. ఆయుధ ఎగుమతులు కూడా కేవలం గతంలో 600 కోట్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 40 వేల కోట్ల ఎగుమతులు చేయగలుగుతున్నాం అన్నారు. ఆంక్కా ప్రాజెక్టు నుంచి తయారయ్యే మొదటి విమానం ఇక్కడి నుంచి ఎగురుతుందని, బీడీఎల్ తయారుచేసిన టార్పేడో, హెచ్ ఎఫ్ సి ఎల్ నుంచి తయారయ్యే ఎలక్ట్రిక్ ఫ్యూజ్ కూడా ఈ నేల నుంచి పరీక్షిస్తాం అన్నారు. డ్రోన్ సిటీ ద్వారా ప్రపంచంలోని ప్రతి మూలకు మన డ్రోన్లు వెళ్లాలని, ఈ ప్రాజెక్టుల తో పాటు పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు లాంటి మౌలిక సదుపాయాలతో పాటు టౌన్షిప్ లతో సమగ్ర ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. అభివృద్ధి గురించి ఆలోచించే దార్శనిక నేత చంద్రబాబు :– నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో టెక్నాలజీ, అభివృద్ధి గురించి ఆలోచించే దార్శనిక నేత చంద్రబాబు నాయుడు లాంటి నేతను ఎక్కడా చూడలేదని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశ విదేశాల్లో చాలా విశిష్టమైన పురస్కారాలు పొందిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని, క్వాంటం సహా ఆధునిక టెక్నాలజీలను ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చారన్నారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ ను ఎంచుకున్నాయని, ఏపీ అంటే అడ్వాన్స్ ప్రదేశ్ అని,




ఏపీ దేశానికి ఓ రోల్ మోడల్ గా మారిందన్నారు. వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టులో నాలుగు డిఫెన్స్ కంపెనీలకు కూడా శంకుస్థాపన జరిగిందని, కర్నూలు డ్రోన్ సిటీలో 8 కంపెనీలకు శంకుస్థాపన చేసాం అన్నారు. అంతర్జాతీయంగా విభిన్న పరిస్థితులు నెలకొన్నాయని, దేశ భద్రత విషయంలో ఇతర దేశాలపై ఆధారపడలేం అన్నారు. ఈ తరహా ప్రాజెక్టులన్నీ మన స్వదేశీ తయారీతో రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని, పుట్టపర్తి లో ఏర్పాటు చేసే ప్రాజెక్టును డిఆర్డిఓ లో భాగమైన అభివృద్ధి చేస్తుందన్నారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధునికతరం యుద్ధ విమానాల అభివృద్ధిపై పనిచేస్తుందని, ఇప్పుడు ఐదవ తరం స్టెల్త్ యుద్ధ విమానం తయారు చేసేందుకు అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ను తయారు చేస్తోందన్నారు. 15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నాం అని, ఇలాంటి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాలు కేవలం కొద్ది దేశాల వద్ద మాత్రమే ఉన్నాయన్నారు. ఇప్పుడు భారత్ కూడా ఆ సరసన చేరిందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

## ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పుట్టపర్తి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా మారుతుంది

### -36 రోజుల్లోనే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగాం

### - మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు కూడా వస్తాయి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

పుట్టపర్తి : ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తి సమీపంలో శుక్రవారం కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలసి ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్ట్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పుట్టపర్తికి ఈ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకం అని, దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతోందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యపాత్ర పోషిస్తుందని, భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారన్నారు. ఆధునికతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ప్రాజెక్టు ఏర్పాటు అవుతుందని, భారత రక్షణ శక్తికి ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందన్నారు. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఆంధ్రప్రదేశ్ లో తయారీ టెస్ట్ చేశారన్నారు. 15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుందని, ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రం గా పుట్టపర్తి మారుతుందన్నారు. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాయన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగాం అని, జెట్ స్పీడ్ తో అనుమతులు ఇచ్చామన్నారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ప్రాజెక్టుతో మరికొన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు కూడా వస్తాయన్నారు. భారత్ పోర్ట్, హెచ్ ఎఫ్ సి ఎల్ , భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామన్నారు. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా




మారాయని, వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందన్నారు. ఓర్వకల్లు లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణి శక్తి, పుట్టపర్తిలో రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళశక్తి గా ఆంధ్రప్రదేశ్ దేశానికి అండగా నిలుస్తుంది అన్నారు. గతంలో రాయలసీమ రతనాల సీమ కానీ వివిధ కారణాలవల్ల కరువుసీమ గా మారిపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆ పరిస్థితిని మార్చాం అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు అందించేలా కార్యాచరణ చేపట్టం అని, కియా పరిశ్రమకు నీటిని అందజేశామని, లక్ష కోట్ల రూపాయలతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నామన్నారు. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరులను సమర్థంగా వినియోగించుకుంటాం అని, కడపలో స్టీల్ ప్లాంట్ ను జూన్ లో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుందన్నారు. డిఫెన్స్, స్పేస్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాలసీమగా మారుస్తామని, కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్ గా మారుతుంది అన్నారు. తిరుపతిలో రాయల్ ఎన్ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరికోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం అన్నారు. కరువు సీమ లో ఏర్పాటు అయిన కియా పరిశ్రమ నుంచి తయారైన కార్లు 80 దేశాలలో తిరుగుతున్నాయని, ఆర్డిటి సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నమైతే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారన్నారు. గతంలో గోల్డ్ అంటే కే జి ఎఫ్, ఇప్పుడు గోల్డ్ అంటే జేజీఎఫ్ అని జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్ వస్తోందన్నారు. ఇక్కడ ఏడాదిలో 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుందని, రెండవ ఏడాది 1500 కిలోల బంగారం తయారు అవుతుందన్నారు. తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అహోబిలం, పుట్టపర్తి లాంటి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను పెంచుతున్నాయన్నారు. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్ తో తీసుకు వెళుతున్నామని, అవకాశాలు తెచ్చే బాధ్యత మాది అని వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది అన్నారు. గత పాలనలో విధ్వంసం చేసి పరిశ్రమలు తరిమేసారని, సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించామన్నారు. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడును సాధించాం అని, వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలని, ఇతరులకు మనమే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. గూగుల్, ఆర్సిలార్ మిట్టల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయని, రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి అన్నారు. ప్రధానమంత్రి ప్రతిపాదించిన వర్క్ ఫ్రం హోం లాంటి ఏడు అంశాలను మనం కూడా ఆచరిద్దాం అని, ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయని, మనం కూడా బాధ్యతతో ముందుకు వెళ్లాలన్నారు.

## ఎప్పుడంటే అప్పుడు పడుకునే అలవాటు ఉందా అయితే ఈ ప్రమాదం పొంచి ఉందని గుర్తుంచుకోండి



ప్రతిరోజూ వేర్వేరు సమయాల్లో నిద్రపోవడం వల్ల శరీరంలోని అంతర్గత గడియారం దెబ్బతింటుంది. దీని ప్రభావం నేరుగా మన గుండె పనితీరుపై పడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ముఖ్యంగా మధ్యవయసులో ఉన్నవారికి ఈ ముప్పు పొంచి ఉందని, భవిష్యత్తులో వారు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల చాలామంది నిద్రపోయే సమయాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఒకరోజు త్వరగా పడుకుంటే, మరోరోజు అర్ధరాత్రి వరకు మేల్కొనడం అలవాటుగా మారింది. అయితే ఈ అలవాటు కేవలం అలసటకే కాదు, ప్రాణాంతకమైన గుండె జబ్బులకు కూడా దారితీస్తుందని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి.

పరిశోధనలో వెల్లడైన షాకింగ్ నిజాలు

ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఓలు పరిశోధకులు దాదాపు 3,000 మందిపై పదేళ్ల పాటు సుదీర్ఘ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధనలో తేలిన ముఖ్యమైన విషయం ఏంటంటే, ప్రతిరోజూ నిద్రపోయే సమయంలో పెద్ద ఎత్తున మార్పులు చేసేవారిలో గుండెపోటు లేదా స్ట్రోక్ వచ్చే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా ఎవరైతే రోజుకు ఎనిమిది గంటల కంటే తక్కువ నిద్రపోతారో, అటువంటి వారు నిద్రపోయే సమయాలను తరచుగా మార్చడం వల్ల వారి గుండెపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. క్రమం లేని నిద్ర అలవాట్లు గుండెకు సంబంధించిన తీవ్రమైన సమస్యల ముప్పును ఏకంగా రెట్టింపు చేస్తాయని ఈ అధ్యయనం పేర్కొంది.

గుండె ఆరోగ్యంపై నిద్ర ప్రభావం

మనం నిద్రపోయే సమయంలో గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి, ఇది గుండెకు ఒక రకమైన విశ్రాంతిని ఇస్తుంది. అయితే నిద్రపోయే సమయాలు రోజుకో రకంగా ఉంటే, శరీరం ఈ విశ్రాంతి ప్రక్రియకు అలవాటు పడలేదు. దీనివల్ల రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కేవలం ఎన్ని గంటలు నిద్రపోతున్నాం అన్నదే కాదు, ఏ సమయానికి నిద్రపోతున్నాం అనేది కూడా అత్యంత కీలకమని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట నిలకడగా ఒకే సమయానికి పడుకోవడం వల్ల శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది, ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

నివారణ మార్గాలు

గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నిద్ర విషయంలో కొన్ని క్రమశిక్షణతో కూడిన మార్పులు చేసుకోవడం అవసరం. రాత్రిపూట పడుకోవడానికి ఒక స్థిరమైన సమయాన్ని నిర్ణయించుకోవాలి, వారాంతాల్లో కూడా దీనిని సాధ్యమైనంత వరకు పాటించాలి. పడుకోవడానికి గంట ముందు మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లకు దూరంగా ఉండటం వల్ల మెదడు ప్రశాంతంగా మారి త్వరగా నిద్ర పట్టేలా చేస్తుంది. మధ్యవయసులో ఉన్నవారు తమ నిద్ర అలవాట్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల భవిష్యత్తులో వచ్చే హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి ముప్పులను నివారించవచ్చు. మంచి నిద్ర కేవలం మెదడుకే కాదు, మీ గుండెకు కూడా ప్రాణం పోస్తుంది. కాబట్టి మీ నిద్ర సమయాలను క్రమబద్ధీకరించుకోండి, ఆరోగ్యంగా ఉండండి. ఈ ముఖ్యమైన విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా తెలియజేయండి.

## ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తింటే శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా.. అస్సలు ఊహించలేరు..



మలబద్ధకం నుంచి విముక్తి పొందాలంటే కివీ పండే మేలని పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం రెండు కివీ పండ్లు తీసుకుంటే కడుపు క్లీన్ అవ్వడమే కాదు.. మీ రోగనిరోధక శక్తి కూడా బుల్లెట్ వేగంతో పెరుగుతుంది. అసలు కివీ పండు గురించి వైద్య నిపుణులు చెబుతున్న ఆశ్చర్యకరమైన విషయాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఇంటింటికీ సాధారణమైపోయాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది రకరకాల మందులు వాడుతుంటారు. అయితే వీటన్నింటికంటే ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తినడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సుమారు 184 మందిపై నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశోధకులు వీరిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి ప్రతిరోజూ రెండు కివీ పండ్లు, మరో బృందానికి ఇసబ్గోల్ లేదా సైలియం పొట్టు ఇచ్చారు. నాలుగు వారాల తర్వాత చూస్తే.. కివీ పండ్లు తిన్నవారిలో జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, కడుపునొప్పి, ఒత్తిడి వంటి సమస్యలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

జీర్ణ వ్యవస్థకు సంజీవని

కివీ పండులో ఉండే యాక్టినిడిన్ అనే ఎంజైమ్, అధిక ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే కరిగే ప్రీబయోటిక్ ఫైబర్ ప్రేగులలోని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడి, కడుపును ఆరోగ్యంగా ఉంచుతుంది.

రోగనిరోధక శక్తికి కేరాఫ్ అడ్రస్

కేవలం జీర్ణక్రియకే కాదు, కివీ పండు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా మేటి. కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి అంటువ్యాధుల నుండి రక్షణ ఇస్తుంది. రోజూ రెండు గోల్డెన్ కివీ పండ్లు తినే వృద్ధులలో గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని, ఒకవేళ అనారోగ్యం సోకినా వారు చాలా వేగంగా కోలుకుంటారని అధ్యయనం తేల్చింది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ: తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక. కంటి చూపు: కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ల్యూటిన్, జీక్సాంథిన్ వంటి మూలకాలు కివీలో ఉన్నాయి. చర్మ సౌందర్యం: యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి. జాగ్రత్తలు తప్పనిసరి కివీలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నా, కొందరికి ఇది అలెర్జీని కలిగించవచ్చు. నోరు వాపు లేదా దురద వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మొదట్లో తక్కువ పరిమాణంలో తింటూ మీ శరీరానికి ఇది పడుతుందో లేదో చూసుకోవడం మంచిది.

## బియ్యం, పప్పులు పాడవుతున్నాయని బాధపడుతున్నారా.. ఈ చిన్న పని చేస్తే ఎన్నాళ్లైనా తాజాగా ఉంటాయని తెలుసా!

బియ్యం, పప్పులు, ధాన్యాలు ఎక్కువ కాలం నిల్వ ఉంచితే వాటిలో రకరకాల పురుగులు పడతాయి. అయితే, వంటింట్లో ఉండే చిన్న చిన్న వస్తువులతోనే ఈ పురుగుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. రసాయన పురుగుమందుల జోలికి వెళ్లకుండా, మన పూర్వీకులు అనుసరించిన సహజ సిద్ధమైన పద్ధతులతో ధాన్యాలను ఎలా కాపాడుకోవాలో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

వంటగదిలో మనం ఎంతో కష్టపడి దాచుకున్న బియ్యం, మినప్పప్పు వంటి ధాన్యాలకు పురుగులు లేదా ముక్కు పురుగులు పట్టడం అనేది గృహిణులకు పెద్ద సమస్య. ఈ పురుగులు కేవలం ఆహారాన్ని పాడు చేయడమే కాకుండా, మన ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతాయి. "ఆహారమే ఔషధం" అని నమ్మే మన సంస్కృతిలో, మనం తినే గింజలను సురక్షితంగా ఉంచుకోవడం మన బాధ్యత.

సరైన నిల్వ పద్ధతులు

ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు పాత్ర ఎంపిక చాలా ముఖ్యం. ఎల్లప్పుడూ స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా నాణ్యమైన ప్లాస్టిక్ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. డబ్బాలో తేమ ఉంటే పురుగులు త్వరగా చేరుతాయి, కాబట్టి వాడే ముందు పాత్రను ఎండలో బాగా ఆరబెట్టాలి. ఒక చిన్న తేమ చుక్క ఉన్నా అది పురుగులు గుడ్లు పెట్టడానికి అనుకూలంగా మారుతుంది.

సాంప్రదాయ నివారణ మార్గాలు

మన వంటగదిలో దొరికే ఎండు మిరపకాయలు పురుగులను తోలడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బియ్యం లేదా పప్పుల డబ్బాలో 5 నుండి 10 ఎండు మిరపకాయలు వేస్తే,

## "ఎముకలు బలహీనమవుతున్నాయా" - తినే ఆహారం కూడా ప్రభావితం చేస్తుందని తెలుసా

### మీరు చేసే చిన్న తప్పులే ఎముకలను దెబ్బతీస్తాయట! - అవేంటో తెలుసా



మన శరీరానికి క్యాల్షియం చాలా కీలకమైన ఖనిజం. ఇది ఎముకలు, దంతాలను బలంగా ఉంచడమే కాకుండా, రక్తపోటును నియంత్రించడంలో, కండరాల పనితీరులో, నాడీ వ్యవస్థ సంకేతాలను పంపడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో శరీరంలో క్యాల్షియం లోపిస్తే ఎముకలు బలహీనపడటంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే, కొన్ని రకాల ఆహార పదార్థాలు శరీరంలోని క్యాల్షియం స్థాయిలను తగ్గించి, ఎముకలను మరింత బలహీనపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

సాఫ్ట్ డ్రింక్స్ :

ఈ రోజుల్లో పార్టీలు, పెళ్లి వేడుక ఏదైనా సాఫ్ట్ డ్రింక్స్ సర్వసాధారణం. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల క్యాల్షియం లోపం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ డ్రింక్స్‌లో ఉండే ఫాస్ఫోరిక్ యాసిడ్ శరీరం క్యాల్షియాన్ని గ్రహించకుండా అడ్డుకుంటుందట. దీనివల్ల క్రమంగా ఎముకలలో క్యాల్షియం స్థాయిలు తగ్గిపోతాయి. ఈ క్రమంలో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సాఫ్ట్ డ్రింక్స్ వినియోగాన్ని పరిమితం చేయడం మంచిదట. శీతల పానీయాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వాటిలో అదనపు చక్కెర అధికంగా ఉంటుంది, క్యాల్షియం అధికంగా ఉండే పానీయాల స్థానంలో వీటిని తీసుకోవడం వలన ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతుందని చీఫ్ఱశీఋఖ్రీ ాఱఎత్ఖుతీఎ శీట వీవఎఱఎఱఅవ పేర్కొంది.

రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం :

వీటిని అతిగా తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరుగుతాయి. ఇది ఎముకల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందంటున్నారు నిపుణులు. ఈ ఆహార పదార్థాలు క్యాల్షియం గ్రహించుకునే శక్తిని అడ్డుకుని, ఎముకలను బలహీనపరుస్తాయని చెబుతున్నారు. అందువల్ల, ఎముకల ఆరోగ్యం మెరుగుపడాలంటే వీటి వినియోగాన్ని పరిమితం చేసుకోవడం మేలు.

స్వీట్స్, బేక్ చేసిన పదార్థాలు :

కేకులు, క్యాండీలు, కుక్కీలు వంటి పదార్థాలలో చక్కెర, రిఫైన్డ్ కార్బో హైడ్రేట్లు ఎక్కువ ఉంటాయి. ఇవి శరీరం క్యాల్షియం గ్రహించకుండా అడ్డుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, ఇవి శరీరంలో వాపును కలిగించి ఎముకలను మరింత బలహీనపరుస్తాయని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి చక్కెర పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం మానేసి, వాటికి బదులుగా ఆరోగ్యకరమైన స్నాక్స్ ని ఎంచుకోవడం ఉత్తమం.

టీ :

టీలో కెఫీన్ ఉంటుంది. ఇది శరీరం క్యాల్షియం గ్రహించే శక్తిని తగ్గిస్తుంది. అతిగా టీ తాగడం ఎముకల ఆరోగ్యానికి హానికరమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, కెఫీన్ ఎక్కువగా ఉండే టీ లేదా కాఫీలు ఎముకల నుంచి క్యాల్షియం బయటకు వచ్చేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, ఎముకలు బలహీనపడతాయంటున్నారు. అందువల్ల, టీ వినియోగాన్ని పరిమితం చేసి, దానికి బదులుగా నీరు లేదా క్యాల్షియం ఎక్కువగా ఉండే తాజా పండ్ల రసాలను ఎంచుకోవడం మంచిది.

మద్యం :

మద్యాన్ని అధికంగా సేవించడం ఎముకల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మద్యం శరీరంలో క్యాల్షియం గ్రహణ శక్తిని తగ్గించడంతో పాటు ఎముకలను బలహీనపరుస్తుంది. దీనివల్ల ఎముకలు పెళుసుగా మారి విరిగే ప్రమాదం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఎముకలు బలంగా ఉండాలంటే, మద్యంకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలికంగా అమితంగా మద్యం సేవించడం వల్ల ఎముకల సాంద్రత తగ్గిపోవచ్చని చీఫ్ఱశీఋఖ్రీ ాఱఎత్ఖుతీఎ శీట వీవఎఱఎఱఅవ పేర్కొంది. ఇది ఎముకలు సులభంగా విరిగిపోయేలా చేయడమే కాకుండా, అనారోగ్య సమస్యలకు, జీవన ప్రమాణాలు దెబ్బతినడానికి దారితీస్తుందని తెలిపింది.

నూనె పదార్థాలు :

సమోసాలు, ఫ్రైడ్ చికెన్, పకోడీల వంటి నూనె ఎక్కువగా ఉండే ఆహారాలు ఎముకలకు హాని కలిగిస్తాయంటున్నారు నిపుణులు. వీటిలో అనారోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఇవి శరీరంలో వాపును కలిగిస్తాయట. అంతేకాదు, ఆయిల్ ఫుడ్స్ క్యాల్షియం గ్రహణ శక్తిని ప్రభావితం చేసి, ఎముకలు బలహీనపడటానికి దారితీస్తుంది. ఇలాంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవడం, తేలికపాటి, ఆరోగ్యకరమైన భోజనాన్ని ఎంచుకోవడం ఉత్తమంఇలాంటి ఆహార పదార్థాలకు బదులుగా, ఆహారంలో పాలు, పెరుగు, ఆకుకూరలు, తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్, విత్తనాల వంటి క్యాల్షియం అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోమంటున్నారు నిపుణులు. అలాగే, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఎముకలను బలపరిచే అలవాట్లను పాటించడం కూడా మేలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ప్రతిరోజూ ఏబీసీ జ్యూస్ తాగితే ఏమవుతుందో తెలుసా.. ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..




ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్‌ల కలయికతో కూడిన ఆరోగ్యకరమైన శక్తివంతమైన పానీయం.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా పిల్లలకు కంటి చూపు మెరుగుదల, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ మూడు పదార్థాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, కూలింగ్ డ్రింక్‌గా అద్భుతంగా పనిచేస్తుంది. ఏబీసీ డ్రింక్ (ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్) తయారీ విధానం, ప్రయోజనాలు తెలుసుకోండి. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవడం.. ఉత్తమమైన జీవనశైలిని అనుసరించడం చాలా మంచిది.. అయితే, ఎండాకాలంలో బాడీని కూల్ గా ఉంచుకునేందుకు మంచి పానీయాలను, ఆహారాలను తీసుకోవాలి.. దీనివల్ల శరీరానికి పోషకాలు, శక్తి లభించడంతోపాటు.. ఆరోగ్యంగా ఉండవచ్చు.. వేసవి తాపం నుంచి బయటపడొచ్చు.. అలా మేలు చేసి పానీయాల్లో ఏబీసీ (గూజాజూశ్రీవ, దీవవ్‌తీశీశీ, ఋతీతీశీ) జ్యూస్ ఒకటి.. యాపిల్, బీట్‌రూట్, క్యారెట్‌ల కలయికతో తయారైన అత్యంత పోషకమైన పానీయం.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు .. పలు సమస్యల నివారణకు సహాయపడుతుంది.. దీనిలోని పోషకాలు.. చర్మాన్ని కాంతివంతం చేయడంతోపాటు.. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. ఇంకా ఈ జ్యూస్ శరీరాన్ని డిటాక్స్ చేసి.. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఈ జ్యూస్ ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. నిపుణుల ప్రకారం.. ఏబీసీ డ్రింక్, కంటి చూపును మెరుగుపరిచే, శరీర ఉష్ణోగ్రతను తగ్గించే, రోగనిరోధక శక్తిని పెంచే ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. యాపిల్, బీట్‌రూట్, క్యారెట్.. ఈ మూడు పదార్థాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు బీట్‌రూట్ లేదా క్యారెట్ జ్యూస్‌లు విడిగా ఇవ్వడం కష్టమైనప్పుడు.. ఈ ఏబీసీ డ్రింక్ వారికి ఆకర్షణీయంగా ఉండి, మంచి ఆహారాన్ని అందించడంలో సహాయపడుతుంది.

ఏబీసీ డ్రింక్ తయారీకి కావలసిన పదార్థాలు:

యాపిల్ 1 బీట్‌రూట్ సగం క్యారెట్ 2 తేనె 1 టేబుల్ స్పూన్ పుదీనా కొద్దిగా తయారీ విధానం: 1. ముందుగా యాపిల్‌ను తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. తొక్క తీయడం వల్ల జ్యూస్ మరింత రుచిగా, సులువుగా తయారవుతుంది. 2. బీట్‌రూట్‌ను కూడా తొక్క తీసి చిన్న ముక్కలుగా చేసుకోవాలి. బీట్‌రూట్ ఎక్కువ వేస్తే రుచి ఘాటుగా మారే అవకాశం ఉంటుంది కాబట్టి, సగం బీట్‌రూట్ మాత్రమే ఉపయోగించడం మంచిది. 3. క్యారెట్‌ను శుభ్రంగా కడిగి ముక్కలుగా కట్ చేసుకోవాలి. క్యారెట్‌కు తొక్క తీయాల్సిన అవసరం లేదు. 4. కట్ చేసుకున్న యాపిల్, బీట్‌రూట్, క్యారెట్ ముక్కలను ఒక మిక్సీ జార్‌లో వేయాలి. 5. అందులో కొద్దిగా పుదీనా ఆకులను వేసి, కొద్దిగా నీళ్లు (ఒక చుక్క) పోసి మెత్తగా నలిగే వరకు బ్లెండ్ చేయాలి. 6. బ్లెండ్ చేసిన మిశ్రమాన్ని వడకట్టి, స్వచ్ఛమైన జ్యూస్‌ను మాత్రమే తీసుకోవాలి. చాలామంది వడకట్టకుండా జ్యూస్‌ను తీసుకుంటారు.. కానీ అలా తీసుకోవడం వల్ల అధిక ఫైబర్ కారణంగా మూడు నుండి నాలుగు గంటల వరకు ఆకలి వేయకపోవచ్చు. జ్యూస్‌ను వడకట్టడం వల్ల పోషకాలు త్వరగా శరీరానికి అందుతాయి. జ్యూస్‌ను గ్లాస్‌లో పోసుకున్న తర్వాత, డయాబెటిస్ సమస్య ఉన్నవారు 1 నుండి 1.5 స్పూన్ల తేనెను కలుపుకోవచ్చు. సాధారణ వ్యక్తులు 3 నుండి 4 స్పూన్ల తేనెను ఉపయోగించుకోవచ్చు. రుచి కోసం అవసరమైతే కొద్దిగా నిమ్మరసం కలుపుకోవచ్చు, లేదా నిమ్మరసం లేకుండానే తీసుకోవచ్చు. ఈ జ్యూస్ రుచికరంగా ఉండటంతో పాటు ఎన్నో పోషకాలను అందిస్తుంది. బీట్‌రూట్, క్యారెట్‌లను సాధారణంగా కూరగాయల జ్యూస్‌లలో తీసుకుంటూ ఉంటారు.. వాటికి ఆపిల్‌ను జోడించడం ద్వారా వేసవిలో చక్కటి కూలింగ్ డ్రింక్‌గా మారుతుంది. ఇది ఏ వయసు వారికైనా సులువుగా తాగగలిగే పానీయం. ఈ ఏబీసీ డ్రింక్ వంటి ఆరోగ్యకరమైన పానీయాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. అయితే, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు తీసుకోవడం బెటర్..

## పిల్లలపై అరుస్తున్నారా.. మీ ప్రవర్తన ఎంత ప్రమాదం తెస్తుందో తెలిస్తే వణికిపోతారు



బయటి వ్యక్తుల ముందు మన పిల్లలతో మనం ఎలా ప్రవర్తిస్తాం అనేది కేవలం ఆ ఒక్క క్షణానికి పరిమితం కాదు. అది వారి వ్యక్తిత్వాన్ని చెక్కుతుంది, ప్రపంచం పట్ల వారి అవగాహనను మారుస్తుంది. ఇటీవల బీహార్‌లో ఒక తల్లి నడిరోడ్డుపై తన కూతురిని దారుణంగా కొట్టిన వీడియో సోషల్ మీడియాలో కలకలం రేపింది. ఇటువంటి సంఘటనలు తల్లిదండ్రుల బహిరంగ ప్రవర్తన పిల్లల మనసులపై ఎంతటి లోతైన గాయాలను చేస్తాయో గుర్తుచేస్తున్నాయి.

రోజంతా పిల్లాడిని చూసుకోవడం వల్ల కలిగే అలసట, ఆపై ఇంటి పనుల ఒత్తిడి.. ఇవన్నీ ఒక్కోసారి మన సహనాన్ని పరీక్షిస్తాయి. కిరాణా షాపులో వస్తువులన్నీ చిందరవందర చేస్తున్నాడనో లేదా మాట వినలేదనో అందరి ముందూ పిల్లాడిపై గట్టిగా అరవడం చాలామంది తల్లిదండ్రులకు అనుభవమే. ఆ క్షణంలో కోపం తగ్గాక, చిన్నారి ముఖంలో కనిపించే ఆ భయం, బాధ చూసి మనసు చివుక్కుమంటుంది. "అలా కాకుండా కాస్త శాంతంగా చెప్పి ఉంటే బాగుండేది" అని పశ్చాత్తాపం కలుగుతుంది.

పిల్లలు ప్రతిబింబాలు

పిల్లలు తమ తల్లిదండ్రులను చూసి, వారిని అనుకరిస్తూ పెరుగుతారు. మనం బయట ఇతరులతో గౌరవంగా, ప్రశాంతంగా మాట్లాడితే పిల్లలు కూడా అవే అలవాట్లను, సామాజిక నైపుణ్యాలను అలవర్చుకుంటారు. అదే మనం అందరి ముందూ అరిచినా, అసభ్యంగా ప్రవర్తించినా వారు కూడా అదే నేర్చుకుని స్నేహితులు లేదా తోటివారితో అలాగే ప్రవర్తిస్తారు. మనం ఎలా ప్రవర్తిస్తాం అనేదే వారికి మొదటి పాఠం అవుతుంది.

భావోద్వేగ నియంత్రణ

పిల్లలు మన మాటల ద్వారా కంటే మన చర్యల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు. ఉదాహరణకు, మనకు చిరాకు కలిగినప్పుడు వెంటనే స్పందించకుండా కాసేపు ఆగి ప్రశాంతంగా ఉండటం చూసి, పిల్లలు తమ భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకోవాలో నేర్చుకుంటారు. అలాగే మనం ఏదైనా తప్పు చేసినప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబితే, వారు కూడా భయం వల్ల కాకుండా నైతిక బాధ్యతతో తప్పును ఒప్పుకోవడం నేర్చుకుంటారు.

దీర్ఘకాలిక ప్రభావాలు

పిల్లల ఎదుట మనం చేసే చిన్న పొరపాట్లు కూడా వారిపై లోతైన ప్రభావం చూపుతాయి. అందరి ముందూ అవమానానికి గురైన పిల్లలు భవిష్యత్తులో సామాజిక ఆందోళన, అతిగా భయపడటం లేదా ఎదురు తిరగడం వంటి లక్షణాలు ప్రదర్శిస్తారు. వారు ప్రపంచాన్ని ఒక అభద్రతా భావంతో చూస్తారు. ముఖ్యంగా ఇతరుల ముందు పిల్లల గురించి "వీడు మొండివాడు", "ఆమెకు లెక్కలు రావు" వంటి ముద్రలు వేయడం వల్ల అవి వారి గుర్తింపుగా మారిపోతాయి. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది.

తల్లిదండ్రులకు సూచన

పిల్లల పెంపకం అంటే ప్రతిసారీ సరిగ్గా ఉండటం కాదు, మనం చేసే చిన్న చిన్న పనుల పట్ల స్పృహతో ఉండటం. పొరపాటున కోప్పడినా, ఆ తర్వాత పిల్లాడికి నచ్చజెప్పడం లేదా క్షమాపణ కోరడం వల్ల బంధం బలపడుతుంది. పిల్లల గౌరవానికి భంగం కలగకుండా వారి తప్పులను సరిదిద్దడం వల్ల వారు క్రమశిక్షణతో పాటు ఆత్మగౌరవాన్ని కూడా అలవర్చుకుంటారు. మీరు ఇచ్చే గౌరవం, చూపే సహనం వారిని రేపు ఒక బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతాయి.

# పెద్దిపై మేకర్స్ నమ్మకం.. రన్ టైమ్ ఎంతంటే?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే పోస్టర్లు, టీజర్, గ్లింప్స్‌తో సోషల్ మీడియాలో భారీ హైప్‌ను సృష్టించిన ఈ సినిమా ఇప్పుడు మరో ఆసక్తికరమైన అప్‌డేట్‌తో ఇండస్ట్రీలో చర్చనీ యాంశమైంది. తాజా సమాచారం ప్రకారం పెద్ది ఫైనల్ కట్ పూర్తై, సినిమాకు 3 గంటల 2 నిమిషాల రన్‌టైమ్‌ను లాక్ చేసినట్టు తెలుస్తోంది. సాధారణంగా ఈ స్థాయి రన్‌టైమ్‌ను మేకర్స్ ఎంచుకోవడం అంటే కథపై ఉన్న నమ్మకానికి తెలియ చేస్తుంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో భారీ సినిమాలు ఎక్కువ నిడివితో వచ్చినప్పటికీ, కంటెంట్ బలంగా ఉంటే ప్రేక్షకులు వాటిని ఆదరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పెద్ది కూడా అదే ట్రెండ్‌ను కొనసాగిస్తుందా అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది.

స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ నేటివిటీ కలిసిన ఈ కథను బుచ్చిబాబు సాన అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించినట్టు సమాచారం. ముఖ్యంగా రామ్ చరణ్ ఈ సినిమాలో కనిపించబోయే లుక్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు పెంచేశాయి. చరణ్ కెరీర్‌లో ఇదొక డిఫరెంట్ మూవీగా నిలవబోతుందని టాక్ వినిపిస్తోంది. ఇక హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తుండగా, కీలక పాత్రల్లో జగపతి బాబు, శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కనిపించనున్నారు. ఈ స్టార్ క్యాస్టింగ్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా శివ రాజ్‌కుమార్ పాత్రకు కథలో చాలా ప్రాధాన్యం ఉంటుందని, ఆయన పాత్ర సినిమాకు హైలైట్ అవుతుందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ా. =. రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి స్పందన లభించింది. ఎమోషనల్ సీన్స్, స్పోర్ట్స్ ఎపిసోడ్స్‌ను రెహమాన్ తన సంగీతంతో మరో స్థాయికి తీసుకెళ్లారనే టాక్ వినిపిస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ సతీష్ కిలారు అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో అన్న ఆసక్తి ఇప్పుడు అభిమానుల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మూడు గంటల నిడివి ఉన్నప్పటికీ ప్రేక్షకులను సీట్లలో కట్టిపడేసే కంటెంట్ ఉంటే పెద్ది ఈ ఏడాది టాలీవుడ్‌లో మరో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# అప్పుడు ఓకే.. మరి ఇప్పుడేమైంది జాన్వీ?



హీరోయిన్ జాన్వీ కపూర్ ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె, పాన్ ఇండియా రేంజ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా ముందుకెళ్తున్నారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. దేవర ప్రమోషన్స్ లో చురుగ్గా పాల్గొన్న జాన్వీ.. ఇప్పుడు పెద్ది విషయంలో ఎందుకు సైలెంట్ గా ఉన్నారనే ప్రశ్న వినిపిస్తోంది. ాశ్రీంశీ =ముం - మిస్ వరల్డ్‌లో ఈ దేశం టాప్.. మొత్తం ఎన్ని టైటిల్స్ తెలుసా? 2018లో బాలీవుడ్ లో ధడక్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, మొదట్లో గ్లామర్ పాత్రలతో ఆకట్టుకున్నా.. తర్వాత యాక్టింగ్ కు స్కోప్ ఉన్న కథలను కూడా ఎంపిక చేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే ఆమె టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది దేవర సినిమాతోనే. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కిన ఆ చిత్రంలో తంగం అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించారు. దేవర పార్ట్-1లో జాన్వీ పాత్రకు స్క్రీన్ స్పేస్ తక్కువగా ఉన్నప్పటికీ.. ఆమె కనిపించిన పాటలు మాత్రం ఫుల్ వైరల్ అయ్యాయి. ముఖ్యంగా చుట్టమల్లే, దావూదీ పాటల్లో ఎన్టీఆర్ తో ఆమె కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. అంతేకాదు, కథ పరంగా అసలు డ్రామా దేవర పార్ట్-2లో ఉంటుందని స్వయంగా జాన్వీ చెప్పడం కూడా అప్పట్లో ఆసక్తి పెంచింది.అయితే సినిమాకు ముందు జరిగిన ప్రమోషన్స్ లో మాత్రం జాన్వీ యాక్టివ్ గా కనిపించారు. ముంబై ట్రైలర్ లాంచ్ నుంచి చెన్నై ప్రెస్ మీట్ వరకు వరుస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాలీవుడ్ ప్రేక్షకులకు సినిమాను దగ్గర చేయడానికి ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. చెన్నై ఈవెంట్ లో తమిళంలో మాట్లాడి సర్ప్రైజ్ చేశారు. మొత్తంగా దేవర ప్రమోషన్స్ లో ఆమె కీలక పాత్ర పోషించారనే చెప్పాలి. ఇప్పుడు అదే జాన్వీ.. తన రెండో తెలుగు చిత్రం పెద్ది విషయంలో మాత్రం కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా రూపొందిస్తున్న ఆ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో జాన్వీ అచ్చియ్యమ్మ అనే పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్నారు. పొలిటికల్ బ్యాక్ డ్రాప్ ఉన్న కుటుంబానికి చెందిన ధైర్యమైన అమ్మాయిగా కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, చికిరి చికిరి పాటలో జాన్వీ పూర్తిగా పల్లెటూరి అమ్మాయి లుక్ లో కనిపించారు. అందుకే సినిమా ఆమెకు నటిగా మరింత గుర్తింపు తీసుకురావొచ్చనే అభిప్రాయం కూడా ఉంది. అయితే సినిమా విడుదలకు ఇంకా దాదాపు 20 రోజులు మాత్రమే ఉండగా.. ఇప్పటివరకు జాన్వీ ప్రమోషనల్ ఈవెంట్లలో కనిపించలేదు. సోషల్ మీడియాలో కూడా పెద్దగా సందడి చేయడం లేదు. పెద్ది పాన్ ఇండియా చిత్రం కావడంతో.. బాలీవుడ్ మార్కెట్ పరంగా జాన్వీ ప్రమోషన్స్ కు రావడం సినిమాకు ప్లస్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. దీంతో దేవర సమయంలో ఫుల్ యాక్టివ్ గా కనిపించిన జాన్వీ.. ఇప్పుడు ఎందుకు మీడియాలో మొదలైంది. అయితే మూవీ రిలీజ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో త్వరలోనే ఆమె ప్రమోషన్స్ లో పాల్గొనే అవకాశం ఉంది. మరి లాస్ట్ స్టేజ్ లో ప్రమోషన్స్ లో జాన్వీ ఎంతవరకు యాక్టివ్ గా కనిపిస్తారో చూడాలి.

# చాక్లెట్ డ్రెస్ లో ప్రగ్యా జైస్వాల్ 'కోకో' మ్యాజిక్!





తెలుగు తెరపై 'కంచె'తో క్లాస్ లుక్, 'అఖండ'తో మాస్ హిట్ అందుకున్న పొడుగుకాళ్ల సుందరి ప్రగ్యా జైస్వాల్, సోషల్ మీడియాలో మరోసారి హీట్ పెంచేసింది. తాజాగా ఆమె షేర్ చేసిన "కోకో కోచర్" ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. చాక్లెట్ బ్రౌన్ కలర్ డ్రెస్సులో మెరిసిపోతున్న ప్రగ్యా..మరి ఆ అద్భుతమైన డ్రెస్ విశేషాలు మీకోసం.. చాక్లెట్ బ్రౌన్ డ్రెస్సులో రాయల్ లుక్: ప్రగ్యా ఈసారి ఎంచుకున్న డ్రెస్ చాలా వెరైటీగా ఉంది. ప్రముఖ డిజైనర్ బబితా మల్కాని డిజైన్ చేసిన ఈ 'చాక్లెట్ బ్రౌన్ కోచర్' డ్రెస్ ఆమె ఫిగర్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. ఇక ప్రీమియం సాటిన్ మరియు ఫాయిల్ జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన ఈ గౌన్, ప్రగ్యాకు ఒక లగ్జరీ లుక్‌ను ఇచ్చింది. ముఖ్యంగా ఆ డ్రెస్సు రంగు ఆమె స్కిన్ టోన్‌కు మరింత గ్లోను జోడించింది. డిజైన్ హైలైట్స్ ఇవే: ఈ డ్రెస్సులో డిజైనర్ చూపించిన క్రియేటివిటీ అద్భుతం. బాడీ పార్ట్ దగ్గర సన్నని పైపులు మరియు థ్రెడ్ ఎంబ్రాయిడరీతో మెరుపులు జోడించారు. హై సైడ్ స్లిట్ ఉండటంతో ప్రగ్యా మరింత గ్లామరస్‌గా కనిపిస్తోంది. ఇక ఒక వైపు నేలను తాకేలా ఉన్న లాంగ్ టెయిల్ ఈ డ్రెస్‌కు ఒక 'మోడరన్ యువరాణి' కళను తెచ్చిపెట్టింది. దీనికి తగ్గట్టుగా ఆమె ధరించిన జ్యువెలరీ కూడా హైలైట్‌గా నిలిచింది.

## కెరీర్ పరంగా ఎలా ఉందంటే?:

సినిమాల విషయానికి వస్తే, ప్రగ్యా జైస్వాల్ కెరీర్‌లో కంచె, జయ జానకి నాయక, అఖండ వంటి మంచి హిట్స్ ఉన్నప్పటికీ, ఆమెకు సరైన బ్రేక్ రావడం లేదు. సీనియర్ హీరోల పక్కన ఆమె జోడీ బాగుంటుందని పేరున్నా, ప్రస్తుతం అదృష్టం కోసం వేచి చూస్తోంది. అయితే అవకాశాలు ఉన్నా లేకున్నా, సోషల్ మీడియా ద్వారా తన అభిమానులను మాత్రం అస్సలు బోర్ కొట్టించదు ఈ అమ్మడు. అందానికి మెడిసిన్ ఏంటో తెలుసా?: ఇక ఇలాంటి ఫ్యాషన్ డ్రెస్సులు వేసుకోవడం, నచ్చినట్టుగా ఫోటో షూట్లు చేసుకోవడం వల్ల వచ్చే కాన్ఫిడెన్స్ మరియు ఆనందమే తన అందానికి రహస్యమని ఆమె పరోక్షంగా చెబుతోంది. ఆమె స్టైల్ మరియు కాన్ఫిడెన్స్ చూస్తుంటే అది నిజమే అనిపిస్తోంది. ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ 'చాక్లెట్ బ్యూటీ' ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. డ్రెస్సు ఏదైనా దానికి తనదైన స్టైల్‌తో ప్రాణం పోయడం ప్రగ్యాకు వెన్నతో పెట్టిన విద్య. మరి త్వరలోనే ఈ అమ్మడు మళ్ళీ వెండితెరపై పెద్ద సినిమాలతో మెరవాలని కోరుకుందాం.



# పెద్ది గ్లింప్స్: పెద్దికి 'మీర్జాపూర్' నటుడి బస్తీ మే సవాల్?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ చిత్రం -పెద్ది- గురించి ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ చిత్రంలో నటిస్తున్న బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ -మీర్జాపూర్- ఫేమ్ దివ్యేందు శర్మకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియో గ్లింప్స్‌ను మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా విడుదల చేసింది. సెట్స్‌లో దివ్యేందు చాలా ఉత్సాహంగా కనిపిస్తూ.. రామ్ చరణ్ .. దర్శకుడు బుచ్చిబాబుతో కలిసి పని చేస్తున్న తీరు చూస్తుంటే ఈ సినిమాలో అతడు ఒక కీలకమైన-ఛాలెంజింగ్ పాత్రలో కనిపించబోతున్నారని అర్థమవుతోంది. దివ్యేందు లైఫ్, కెరీర్ ప్రయాణం గురించి తెలుసుకుంటే చాలా ఆసక్తి కలుగుతుంది. అతడు థియేటర్ ఆర్ట్స్ నుండి మొదలై ప్రతిష్టాత్మక ఖీ×× (ఫిలిం అండ్ టెలివిజన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) లో శిక్షణ పొందడం వరకు ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. తన అసలు పేరు దివ్యేందు శర్మ అయినా.. వృత్తిపరంగా తన ఇంటిపేరును తొలగించి కేవలం -దివ్యేందు-గా తన గుర్తింపును మార్చుకున్నారు.

తొలినాళ్లలో వాణిజ్య ప్రకటనలలో నటించిన అతడు -ప్యార్ కా పంచనామా చిత్రంలో -లిక్విడ్- అనే హాస్య పాత్రతో యువతకు చేరువయ్యారు. ఆ తర్వాత వచ్చిన -మీర్జాపూర్- వెబ్ సిరీస్‌లో -మున్నా భయ్యా-గా అతడు పండించిన క్రూరత్వం.. డార్క్ హ్యూమర్ కెరీర్‌ను మలుపు తిప్పాయి. ప్రస్తుతం -పెద్ది- సెట్స్ నుండి విడుదలైన వీడియోలో దివ్యేందు ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో కనిపిస్తున్నారు. చరణ్, బుచ్చిబాబులతో అతడికి ఉన్న సాన్నిహిత్యం షూటింగ్ సజావుగా సాగుతోందనడానికి నిదర్శనం. ఈ సినిమాలో క్రికెట్ నేపథ్యం ఉంటుందని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆ క్రీడకు.. దివ్యేందు పోషించే పాత్రకు ఉన్న కనెక్షన్ ఏమిటనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. బుచ్చిబాబు తన సినిమాల్లో ప్రతి పాత్రను చాలా లోతుగా తీర్చిదిద్దుతారు కాబట్టి దివ్యేందు కోసం ఒక పవర్‌ఫుల్ రోల్‌ను సిద్ధం చేశారని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్ జెన్ జెడ్ ప్రేక్షకులలో దివ్యేందుకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. సహజమైన నటన, అద్భుతమైన కామిక్ టైమింగ్ , ఇంటెన్స్ పర్ఫార్మెన్స్‌తో అతడు తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు కూడా అతడి నటన పై మంచి గౌరవం ఉంది. -పెద్ది- వంటి పాన్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న ఈ జెన్- జీ నటుడు ఈ సినిమా విడుదల తర్వాత ఇక్కడ మరింత బిజీ ఆర్టిస్ట్‌గా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. హిందీ నటులు సౌత్ సినిమాల్లో రాణిస్తున్న తరుణంలో దివ్యేందు ఎంట్రీ సినిమాకు అదనపు బలాన్ని ఇస్తోంది. మొత్తానికి -పెద్ది- గ్లింప్స్ ద్వారా చిత్ర బృందం ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీని పెంచింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తుండటం..

భారీ తారాగణాన్ని రంగంలోకి దించడం సినిమా స్థాయిని పెంచుతోంది. జూన్ నెలలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ద్వారా రామ్ చరణ్ - దివ్యేందుల మధ్య ఉండే ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీని చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ గ్లింప్స్ సోషల్ మీడియాలో ప్రస్తుతం ట్రెండింగ్‌లో నిలిచి సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

# ల్యారీ పరువు తీసిన పాకిస్తాన్ డైరెక్టర్!

ఒక చిత్రం సృష్టించిన వివాదం లేదా ప్రభావం మరొక చిత్రానికి పునాదిగా మారుతుంది. బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ నటించిన -ధురంధర్- పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. పాకిస్థాన్‌లోని ల్యారీ ప్రాంతాన్ని, అక్కడ పాత్రల్ని ఆధారంగా చేసుకుని ఆదిత్య ధర్ తెరకెక్కించారు. అయితే ల్యారీ ప్రాంతాన్ని కేవలం నేరాలకు నిలయంగా మాత్రమే చూపించారనే కొంత మంది పాకిస్తాన్ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ నేపథ్యంలో ఈ సినిమాను నిరసిస్తూ ల్యారీ ప్రాంతపు అసలు స్వభావాన్ని అక్కడి సామాజిక జీవనాన్ని సానుకూల కోణంలో ఆవిష్కరించాలనే ఉద్దేశంతో పాకిస్థానీ దర్శకుడు అబు అలీహా -మేరా ల్యారీ- అనే సినిమాను తెరకెక్కించారు. కేవలం కౌంటర్ మూవీగా కాకుండా మహిళా ఫుట్‌బాల్ క్రీడ నేపథ్యంలో స్ఫూర్తిదాయక కథగా తెరకెక్కించారు. -ల్యారీ ప్రాంతమంటే? నేరాలు, ముఠా తగాదాలే కాదు. అక్కడ అద్భుతమైన క్రీడా నైపుణ్యం కలిగిన యువత ముఖ్యంగా ఫుట్‌బాల్ క్రీడాకారిణులు ఉన్నారని ప్రపంచానికి చాటి చెప్పాలని చిత్ర బృందం భావించింది. భారీ అంచనాల మధ్య భావోద్వేగపూరితమైన ప్రమోషన్లతో ఈ చిత్రం తాజాగా రిలీజ్ అయింది. -ధురంధర్- సినిమాకు -మేరా ల్యారీ- గట్టి సమాధానం ఇస్తుందని పాక్ సినీ వర్గాలు ఎన్నో అంచనాలు పెట్టుకున్నాయి. అయితే తొలి షోతోనే వాళ్ల ఆశలన్నీ ఆవిరైపోయాయి. ాశ్రీంశీ బాక్సాఫీస్ లెక్కలు చూస్తే చిత్ర యూనిట్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చాయి. కనీసం సొంత దేశంలో కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది మేరా ల్యారీ. సినిమా కథా గమనం నెమ్మదిగా ఉండటం, బలహీనమైన స్క్రీన్‌ప్లే కారణంగా ప్రేక్షకులు థియేటర్ల వైపు కన్నెత్తి చూడలేదు. ం

విమర్శకులు కూడా ఈ సినిమా ఆశించిన స్థాయిలో లేదని పెదవి విరిచేసారు. ఒక సినిమాపై కోపంతో తీసినట్లు ఉందే తప్ప బలమైన కథాబలం లేదని అసంతృప్తిని వ్యక్తం చేసారు. ఇక వసూళ్ల పరంగా చూస్తే -మేరా ల్యారీ- పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. కొన్ని ప్రధాన నగరాల్లోని థియేటర్లలో ఒక షోకు కేవలం 22 టిక్కెట్లు మాత్రమే అమ్ముడ య్యాయంటే? ఎంతటి పరాజయాన్ని మూటగట్టుకుందో? అర్థం చేసుకోవచ్చు. ఖాళీ కుర్చీలతో షోలు నడపడం సాధ్యం కాక చాలా చోట్ల థియేటర్ల యాజమాన్యాలు ప్రదర్శనలను నిలిపివేశాయి. ఒక ప్రాంతం పరువును కాపా డాలని తీసిన సినిమా ఇలా బాక్సాఫీస్ వద్ద చతికిలపడటం ల్యారీ ప్రాంతానికే అవమానకరంగా మారిందని సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఏ సినిమా అయినా ఫ్యాషన్ తో తీయాలి తప్ప ఒకరిపై కోపం, కక్షతో చేస్తే ఫలితాలు ఇంతే దారుణంగా ఉంటాయంటూ నెటి జనులు పోస్టులు పెడుతున్నారు. నిరంతరం భారత్ పై విషం కక్కే పాకిస్తాను వక్రబుద్ధి మరోసారి సినిమా రూపంలో కూడా బయట పడిందని జనాలు నవ్వుతున్నారు.



PRINTER,PUBLISHER AND OWNED BY M. A. NAVEEN KUMAR AND PRINTED AT M /S VANAMALI PUBLICATIONS , # 2-5-B , Revenue Ward No :2, Rudrampeta, Anantapur Rural & Mandal, Anantapur -515004, Ananthapuramu District, Andhra Pradesh PUBLISHED AT D. No 1-493 B, INDIRA GANDHI NAGAR , Anantapur -515001, Ananthapuramu District, Andhra Pradesh Editor : M. A .NAVEEN KUMAR Email : kumarmanaveen @gmail.com cell: 8919517176